
భక్తిమాల
APRIL 2008







// భక్తిమాల

తెలుగు ఆధ్యాత్మిక మాసపత్రిక

| పుష్పగుచ్ఛం 31 | ఏప్రిల్ 2008 | పుష్పం 4 |
|---|---|---|





సంత్యక్తలోకా నపి కర్మ దూరాన్
భక్తాన్ సకృత్ స్తోత్ర పర ప్రవృత్తీన్।
కదాపి నైవోజ్ఝతి యః ప్రసన్న
స్తం చారు శీలం గురుదత్తమీడే ॥

(శ్రీదత్తధ్యానమాలిక)

సంస్థాపకులు
శ్రీదత్తపీఠాధిపతి
శ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీ

ముక్తికన్యా వివాహేచ్ఛా
యద్యస్తి తవమానసే।
ఆత్మాలంకరణార్థాయ
భక్తిమాలాం గళే ధర॥

తాత్పర్యం

ముక్తికన్య నిన్ను వరించాలంటే భక్తిమాలతో నిన్ను అలంకరించుకో.

సంపాదకులు
శ్రీకుప్పా వేంకట కృష్ణమూర్తి

పూర్వం ఎప్పుడో ఒకసారి స్తోత్రం చేసిన భక్తులు కాలక్రమంలో మరణించి ఈ లోకం వదిలిపెట్టినా, లేదా సంన్యసించి కర్మలనే వదిలిపెట్టినా, లేదా భ్రష్టులై సత్కర్మలనే వదిలేసినా సరే, ఆయన మాత్రం వారిని ఒకప్పుడు గూడా వదిలిపెట్టనే పెట్టరు. ఆయనయొక్క ప్రసన్నత అంత గొప్పది. అందుకే ఆయన చారుశీలుడు. అట్టి గురుదత్త దేవులను స్తుతి చేస్తున్నాను.

# భక్తిమాల

## శ్రీభక్తిమాల ట్రస్ట్ (రి),

## శ్రీగణపతి సచ్చిదానంద ఆశ్రమము



దత్తనగర్, మైసూరు - 570 025, ఫోను : 0821 - 2486486, 2480424,

ఫ్యాక్స్ : 0821 - 2487487.

ఇంటర్నెట్ : http://dattapeetham.com.Email:mail@dattapeetham.com

**Bhaktimala Email :**

**subscription_bhaktimala@dattapeetham.com:** For Informaiton regarding Subcription, effecting change of your mailing address etc.


### ఈ సంచికలో............


| | |
|---|---|
| శ్రీదత్తధ్యానమాలిక | 01 |
| అమృత బిందువు | 03 |
| సూక్తిమంజరి | 04 |
| పిల్లలూ! వీరు ఎవరు తెలుసా? | 09 |
| అన్నదానము | 14 |
| శ్రీస్వామీజీ చరిత్ర | 21 |
| భజగోవిందం | 24 |
| దత్తపీఠం - 13 | 26 |
| అనుభవాలు | 28 |
| I-SERVE కార్యక్రమ విశేష | 29 |
| చికాగో సాహితీ సంకలనంలో వెల్లివిరిసిన ఓ. రమణ మూర్తి | 32 |
| మైసూరు ఆశ్రమంలో మహాశివరాత్రి | 37 |
| సాహిత్య పునస్సృష్టి | 39 |
| స్వామీజీవారి పర్యటనా విశేషాలు | 40 |
| శ్రీస్వామీజీవారి పర్యటనా పట్టిక | 48 |


### ఫోటోల వివరాలు

ముఖచిత్రం:

మలేషియా ఆశ్రమంలో తమలపాకులతో సుందరంగా అలంకరించిన కార్యసిద్ధి హనుమ సాన్నిధ్యంలో శ్రీదత్తపూజ గావిస్తున్న స్వామీజీ

వెనుక అట్టపై:

దీ. 29.03.2008న మోనాష్ యూనివర్సిటీ, మెల్‌బోర్న్ నందు నిర్వహించిన ధ్యాన సంగీత చికిత్సా విభావరి సుందర దృశ్యము

1) ధ్యాన సంగీత చికిత్సా విభావరిని జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభిస్తున్న నాదమూర్తి శ్రీస్వామీజీ. ప్రక్కన వున్నవారు శ్రీ మార్తాండ జోషి, శ్రీ మంజునాథ్

2) అనంతాకాశం, అనంత సాగరం, అనంతమూర్తి– గోల్డ్‌కోస్ట్, ఆస్ట్రేలియాలోని రెక్స్ పాయింటు చెంత పసిఫిక్ సముద్ర తీరాన శ్రీ స్వామీజీ (చూడండి 48వ పేజీ)


చందా వివరములు : - 2 సం॥లకు రూ॥150/ -, 5 సం॥లకు రూ॥ 350/ -,
దాతలు రూ॥ 2000/ -, పోషకులు రూ॥ 5000 / - ,రాజ పోషకులు రూ॥10,000 -,
విదేశీయులకు 1సం॥కు - 25 U.S. Dollors, జీవిత సభ్యత్వం - 350 U.S. Dollors
ప్రకటన వివరాలు : - శ్రీస్వామీజీవారి ఫోటోతో పూర్తిపేజీ రూ॥ 5000 -,
శ్రీస్వామీజీవారి ఫోటో లేకుండా పూర్తిపేజీ రూ॥ 4,500 -, సగం పేజీ రూ॥ 2500 -,
పావు పేజీ రూ॥ 1300 -. పెండ్లి మరియు ఇతర ఆశీస్సులకు రూ॥ 600.



## గుణవంతుడు

**గడ్డము పెంచిన వారందరు జ్ఞానులు కారు**
**ధనవంతులందరు దానగుణులు కారు**
**విద్యావారధులందరు వినయ సంపన్నులుకారు**
**గుణమునుబట్టి నడవడికనిబట్టి**
**నిర్ణయించవలెను – సచ్చిదానందా!**
*(శ్రీస్వామీజీవారి చిటిక సాహిత్యమునుండి)*

**– రాణీ –**

సమాజంలో మార్పు చాలా వేగంగ కనిపిస్తోంది. వేగం వెనకాల నిజాయితీ లోపిస్తోంది. న్యాయం, ధర్మం, నైతిక విలువలు వెనుకకు వెళ్ళి పోతున్నాయి.

శరీరం అంటే కృంగి కృశించిపోయేది అని, కృతజ్ఞతాభావం లేనిదని, క్షణకాలంలో నాశనం అయిపోయేది అని గ్రహించిన జ్ఞానులు శరీరం మీద తనకు గల వ్యామోహాన్ని, మమకారాన్ని విడచిపెట్టేసేవారు. అందువలననే మహర్షులు మనకు గడ్డాలతో, మీసాలతో తైలసంస్కారం లేని జుట్టుతో కనిపిస్తారు.

**సర్వాశుచి నిధానస్య కృతఘ్నస్య వినాశినః।**
**శరీరకస్యాపి కృతే మూఢాః పాపాని కుర్వతే॥** అన్నారు.

కాని నేటి సమాజంలో మనకు కనిపిస్తున్న గడ్డాలవారందరు జ్ఞానులు కారు. అదే విధంగ దాతృత్వం అనేది మనస్సునకు సంబంధించిన గుణం. ధనవంతులే దానం చేస్తారని అనుకోకూడదు. బిచ్చగాడు కూడ తనకంటె దీనుడైన అనాధకు దానం చేస్తున్నాడు. మనస్సులో దానం చేయాలనే సద్గుణం ఉన్నవాడు దాత అవుతున్నాడు.

విద్య వినయాన్నిస్తుందని పెద్దల మాట. కాని విద్యాధికులందరు వినయవంతులు కారు. వినయవంతులైనవారివద్దగల విద్యాధనమే సమాజ శ్రేయస్సునకు ఉపయోగపడుతుంది.

అందువలన వారి గుణగణాలను బట్టి, ప్రవర్తనసుబట్టి గుణవంతులను నిర్ణయించాలి కాని, బాహ్యాడంబరాలను చూసి మోసపోరాదు.

అట్టి గుణవంతులకు సచ్చిదానందుడు ఎల్లవేళలా అండగ ఉండి కాపాడుతుంటాడు.

❖ ❖ ❖




# చేసిన కర్మము - చెడని పదార్థము

**జన్మనా మథ లోకానాం**
**యాతాయాత శతైరపి**
**న ముంచతి కృతం కర్మ**
**వినా భోగ మితి స్థితిః ॥**

(తాత్పర్యము: జన్మలూ లోకాలు ఎన్ని వచ్చినా పోయినా, చేసిన కర్మ అనుభవించందే పోదు అనేదే ఉన్న స్థితి.)

మన ధర్మశాస్త్రంలో ప్రాయశ్చిత్తకాండ చాలా విస్తారంగా వుంటుంది. ఆ కాండలో మనం కనీ వినీ యెరగని పాపాల ప్రస్తావన వుంటుంది. అందులో కొన్ని రకాల పాపాలను ఊహించటమే చేతకాదు మనకు. అలాంటి పాపాలకు గూడా ప్రాయశ్చిత్తాలు చెపుతూ వుంటారు ఆ గ్రంథాల్లో. అది చూసే సరికి మనకు  కొంత ధైర్యం కలుగుతూ వుంటుంది – " ఫరవాలేదు. మనం ఇంత ఘోర పాపాలు చెయ్యలేదు. మనం చేసే దేశవాళీ పాపాలకు ప్రాయశ్చిత్తాలు దొరకక పోవు" – అని.

కానీ, తీరా పరిశీలించి చూస్తే – వాళ్ళు ప్రాయశ్చిత్తంగా చెప్పే విషయాలు ఇంచుమించు ప్రాణాంతకంగా వుంటూ వుంటాయి. ప్రతి దానికీ కృచ్ఛ్ర చాంద్రాయణ వ్రతాలు కనీస పక్షంగా చెయ్యాలంటారు. ఆ వ్రతాలు ఇంచుమించుగా ఆమరణ నిరాహార దీక్షతో సమానంగా వుంటాయి. కాఫీ లేందే కళ్ళు తెరవటం చేతకాని బ్రతుకులకు కృచ్ఛ్ర చాంద్రాయణ వ్రతాలు సాధ్యమా?

అవే, సాధ్యం కాకపోతే, ఆపై ప్రాయశ్చిత్తాలు మనవల్లేమౌతాయి? అంటే ఇక మనకు శాశ్వత నరకమే గతా?!

ఇలా బాధ పడేవారికి మరింత గుండె గుబులు పుట్టించేదిగా వుంది యీ నెల సూక్తి. కాని, దీని అసలైన భావం అర్థం కావాలంటే, మనం వ్యాస మహర్షి చెప్పిన ఓ పిట్ట కథ పరిశీలించక తప్పదు. ఆ మాటకొస్తే ఇది పిట్ట కథ కాదు – పురుగు కథ! ఇంతకూ కథ వినండి –

ఒకప్పుడు వ్యాసభగవానుడు ఒక అడవిలో ఒక రహదారిమీద నడుస్తున్నాడు. ఇంతలో ఆ దారిమీద ఒక నల్లని పురుగు అమిత వేగంతో పరిగెత్తుతోంది. ఎందుకో వ్యాసభగవానుడికి ఆ పురుగుతో మాట్లాడాలనిపించింది. "ఎందుకింత పరిగెత్తుతున్నావు పురుగా?" అన్నాడు వ్యాసభగవానుడు పురుగుల భాషలోనే.

"వచ్చి పడిపోతోంది బండి, నలిగి చచ్చిపోతాను" అంది పురుగు భయంతో, వణికిపోతూ, రొప్పుతూ.

వ్యాసుడు ఇటూ అటూ చూశాడు. ఎక్కడా ఏ బండీ లేదు. నిశితంగా చూడగా ఎన్నో మైళ్ల దూరంలో ఒక రథం వస్తోంది. పురుగులకు వుంటే శ్రవణశక్తివల్ల ఆ ధ్వని ఈ పురుగుకు అప్పుడే తగిలి ఇంత బెంబేలు పడిపోతోందన్నమాట. వ్యాసుడు ఒకసారి ఆ పురుగు వంక విచిత్రంగా చూసి – "పురుగా! ఏమి సుఖం వుంది ఈ శరీరంలో నీకు? గంధం పూసుకోగలవా? నృత్యం చేయగలవా? ఈ పాడు శరీరం నశించిపోతే అది మరీ మంచిది కదా. ఇంకా మంచి జన్మ రావచ్చు కదా" అన్నాడు.

"నీ శరీరమే పాడు శరీరం. నాకీ శరీరం హాయిగా వుంది" అని కసిరి కొట్టింది పురుగు.

కాని వ్యాసభగవానుడితో ఏడడుగుల స్నేహం ఏర్పడేటప్పటికి దానికి ఏవేవో పూర్వజన్మ స్మృతులు గుర్తు రాసాగాయి. అది పరుగు ఆపేసి దీనంగా ఇలా అంది–

"మహానుభావా! నువ్వు చెప్పింది నిజం. ఒకప్పుడు వంటినిండా గంధాలు పూసుకొని స్త్రీలతో కలిసి నృత్యాలు చేస్తూ వుండేవాడిని. పురుగులను

చూస్తే అసహ్యించుకొనేవాడిని. నా విలాసాల కోసం ఎందరినో హత్య చేశాను. ఎవరికీ దానం చేయలేదు. రక్షిస్తానని ఆశపెట్టి పిలిచి భక్షిస్తూ వుండేవాడిని. ఇన్ని చేసినా నా తల్లంటే మాత్రం ప్రాణంగా వుండేది నాకు. ఆమెకు చాలా సేవలు చేస్తూ వుండేవాడిని. ఒకరోజు మాత్రం ఒక గడ్డాల బ్రాహ్మణుడు వానలో తడిసి నా యింటి చూరుకింద నిలబడి వుంటే, నా తల్లి కోరిక మేరకు ఆయనను లోపలకు పిలిచి కొద్దిగా అన్నం పెట్టాను."

పురుగు ఇంతవరకూ చెప్పి ఆపైన ఇంక గుర్తురాక ఆగిపోయింది. వ్యాసముని సన్నగా నవ్వి ఇలా అన్నాడు –

"పురుగా! ఆనాడు మీ యింట్లో అన్నం తిన్నది నేనే. తల్లి సేవ, నా సాంగత్యం, నీకు ఈ పూర్వజన్మ స్మృతినిస్తున్నాయి. అది అలా వుంచు. అన్నీ గుర్తొచ్చాయి కదా! ఇప్పుడు ఈ పురుగు శరీరం బాగుందా నీకు?"

పురుగు కన్నీరు కార్చింది. "మహర్షీ! నీదయ గొప్పది. గుప్పెడన్నం తిన్నందుకు మరుజన్మలోకూడ పలుకరిస్తున్నావు నన్ను. నేను ఎందరి ఉపకారాలో పొంది వారిని చంపాను. ఎంత అంతరం నీకు, నాకు?! అందుకే పురుగునై పుట్టాను. అబద్ధం చెప్పలేను మీతో. ఇపుడు ఈ శరీరంకూడ నాకు అందంగానే కనిపిస్తోంది. ఈ శరీరం ఎంతో ప్రియంగా వుంది. కాని దేవా! నీ సాంగత్య మహిమవల్ల నాకు జ్ఞానం కలుగుతోంది. నాకు ఏది మంచో నాకే తెలియదిపుడు. దయతో నాకేదైనా మంచి మార్గం చెప్పు."

వ్యాసభగవానుడు మరొకసారి నవ్వి "పురుగా! తెలిసింది కదా– గర్వంతో విర్రవీగినదాని ఫలం! దేవతలకైనా పాపఫలం ఎన్ని కల్పాలకైనా అనుభవించక తప్పదు. దేహంమీద, సుఖాలమీద మమకారంతో అన్ని పాపాలు చేశావు. ఇప్పటికైనా ఆ మమకారాన్ని వదలగలిగితే నేను ఉపకారం చేయగలను."

పురుగు గద్గద స్వరంతో చెప్పింది. "మహర్షీ! నీ సాంగత్యబలమే నాకు ఈ జ్ఞానాన్ని కలిగిస్తోంది. ఆ బలమే నాకు మమకారాన్ని జయించే శక్తిని ప్రసాదించాలి. ఆ తర్వాత నేనేమి చేయాలో కూడ నీవే ఆదేశించాలి."

వ్యాసుడు మళ్ళీ చెప్పాడు. "పురుగా విను, ఇవాళ్ళ పశ్చాత్తాపం కలిగినంత

మాత్రాన వెనుకటి పాపాల భారం పోదు. ఈ విషయంలో పెద్దలు చెప్పే సూక్తి ఒకటి వుంది.

**జన్మనా మథ లోకానాం**
**యాతాయాత శతైరపి**
**న ముంచతి కృతం కర్మ**
**వినా భోగ మితి స్థితిః ॥**

(తాత్పర్యము: జన్మలూ లోకాలు ఎన్ని వచ్చినా పోయినా, చేసిన కర్మ అనుభవించందే పోదు– అనేది ఉన్న స్థితి.)

ప్రాయశ్చిత్తాలు పశ్చాత్తాపం కలిగాక మాత్రమే పని చేస్తాయి. అప్పుడు గూడా, శిక్షలోని దుఃఖం తగ్గేందుకు మాత్రమే ఉపకరిస్తాయి. దీనికి మినహాయింపులుండవు.

నీకు ఇంకా పశు, పక్షి జన్మలు వున్నాయి. వాటిని గూడా అనుభవించక తప్పదు.

ఐతే, నీకో ఉపాయం చెప్పగలను. ఏమిటంటే, మిగిలిన జన్మలలో మమకారం వదిలిపెట్టి అనుభవించు. ద్వేషం వదిలిపెట్టి అనుభవించు. అలా చేస్తే చివరికి ఓ మంచి వంశంలో మనిషిగా పుడతావు. అపుడు నీకు మళ్ళీ దర్శనమిస్తాను."

చాలాయేళ్ళ తరువాత ఒక బ్రాహ్మణ బాలకుడు వ్యాసమహర్షి ఆశ్రమానికి వచ్చాడు. వ్యాసుణ్ణి చూస్తూనే ఆ కుర్రవాడికి వెనుకటి జన్మలు గుర్తుకు వచ్చి వలవలా ఏడ్చి పాదాలపైపడి, "గురుదేవా! మీరు చెప్పిన ప్రకారం మీరు మళ్ళీ దర్శనమిచ్చారు. నేనిప్పుడు ఏమి చేయాలి?" అన్నాడు. వ్యాసుడు తల నిమిరి "పురుగా" అని పిలిచాడు. ప్రేమగా చెప్పసాగాడు.

"నాయనా! చాలాసార్లు మరణించిన గుర్తు వుంది కదా! చాలాసార్లు మరణమంటే భయపడ్డావు కదా! ఇపుడు నువ్వు భయపడవలసింది మరణానికి కాదు, ధర్మానికి. ఏయే అధర్మాలు చేశావో నీకే తెలుసు. వాటికి భయపడు. ఏ సాధు పురుషులకు ద్రోహం చేశావో నీకే తెలుసు. దానికి భయపడు. ఎవరి స్నేహం నీకు ఈ స్మృతిని ఇచ్చిందో నీకే తెలుసు. వారిని మాత్రం ప్రేమించు."

ఆ బాలుడు మరొకసారి సాష్టాంగ వందనం చేసి ఇలా అన్నాడు – "గురుదేవా! ఎన్ని జన్మలు మిమ్మల్ని శ్రమ పెట్టాను? మీ దర్శనంవల్ల నా జన్మజన్మల పాపాలు నశించాయి. ఇక నేను మీ పాదాలవద్దనే తపోనిష్ఠలో వుండపోతాను అనుమతించండి."

ఆ బాలుడు అక్కడే తపస్సులో వుండిపోయాడు.

ఇదీ కథ!

ఈ కథవల్ల చేసిన పుణ్యం లాగానే చేసిన పాపం గూడా చెడని పదార్థమని మనకు విస్పష్టమౌతోంది. అందుకే – "చేసిన కర్మము చెడని పదార్థము" అన్నారు. ఇది విస్పష్టమైతే చాలదు. అది విస్మృతిని పడకుండా వుండాలి. జన్మ జన్మాల బంధువైన దత్తసద్గురువు దయతో, మీకందరకూ వివేకము – అవిస్మృతి అనే జంట వరాలు అవిచ్ఛిన్నంగా లభించుగాక.

**జయగురుదత్త**

శ్రీమతి మాధురి & శ్రీ జి. కేశవమూర్తి గార్లకు

**పుత్రుడు**

21.1.2008 సోమవారం జన్మించినాడు.

**ఈ చిరంజీవిపై శ్రీగురుదేవుల కృపాశీస్సులు వర్షించు గాక!**

శ్రీమతి&శ్రీ తుట్టగుంట రామారావు గార్ల కనిష్ఠ కుమార్తె

**చి॥ల॥సౌ॥ లక్ష్మి**

శ్రీమతి&శ్రీ ముక్కపాటి దామోదరరావు గార్ల ద్వితీయ కుమారుడు

**చి॥ సత్యసాయి చక్రవర్తి ల**

వివాహం 23.2.2008 స్థిరవారం రాజానగరంలో జరిగింది.

**ఈ నూతన దంపతులపై శ్రీగురుదేవుల కృపాశీస్సులు వర్షించు గాక!**

శ్రీ ముక్కు సీతారామ శర్మ గారి అనుజుడు

**చి॥ సుబ్రహ్మణ్య శర్మ**

శ్రీమతి&శ్రీ గంపా శ్రీరామ్ శర్మ గార్ల కనిష్ఠ పుత్రిక

**చి॥ల॥సౌ॥ సీతాదేవి ల**

వివాహం 16.2.2008 స్థిరవారం కె. కోటపాడులో జరిగింది.

**ఈ నూతన దంపతులపై శ్రీగురుదేవుల కృపాశీస్సులు వర్షించు గాక!**

పిల్లలూ, మీరు

# అశ్వినీ దేవతలు

మీకు తెలుసా?



*(జరిగిన కథ - విశ్వకర్మ పుత్రి సంజ్ఞాదేవి తన భర్త వేడి తట్టుకోలేక తనలాంటి మరో స్త్రీని సృష్టి చేసి, భర్త ఇంట్లో అట్టి పెట్టి తను పుట్టింటికి వెళ్ళిపోయింది. అక్కడ వుండలేక అడవిలో ఆడగుర్రమై తపస్సు చేసుకుంటోంది. కొంత కాలానికి ఈ విషయం తెలిసి వివస్వంతుడు భార్య కోసం వెతుక్కుంటూ వెళ్ళాడు. అడవిలో వారిద్దరికీ అశ్వినీ దేవతలు జన్మించారు. దేవతలందరూ అక్కడికి వచ్చి చేరారు. సూర్యుడు తన వేడి తగ్గించమని దేవతలను ప్రార్థించాడు. దానికోసం "ఎంత బాధైనా ఓర్చుకుంటా"నన్నాడు. ఇక చదవండి....)*

వెనువెంటనే విశ్వకర్మ ఒక నూతన యంత్రాన్ని సృష్టిచేసి, దాని మీద వివస్వంతుడ్ని కూర్చోబెట్టి, బొమ్మలను చిత్రిక పట్టినట్లుగా చిత్రవిచిత్రమైన రీతులతో సాన బెట్టడం మొదలు పెట్టాడు.

ఆశ్చర్యకరంగా గుట్టల కొద్దీ తేజోధూళి రాలి పడుతోంది. విశ్వకర్మగారు ఆ తేజోధూళిని (సోలార్ డస్ట్‌ను) ఒక్క రేణువు కూడా వ్యర్థం కాకుండా జాగ్రత్త చేసి, ఆ తేజస్సుతో వింత వింత వస్తువులు తయారు చెయ్యసాగాడు.

ముందుగా దేదీప్యమానమైన చక్రం ఒకటి రూపొందింది. దానిని శ్రీమహావిష్ణువు స్వీకరించాడు.

తరువాత భయంకరమైన త్రిశూలం ఒకటి తయారయింది. దానిని పరమశివుడు స్వీకరించాడు.

ఆ తరువాత ఎనిమిది శంఖాలు రూపొందాయి. వాటిని అష్ట వసువులు స్వీకరించారు.

తరువాత మిలమిలలాడే ఆడపిల్ల ఒకతె ఆ ధూళిలోంచి ఉద్భవించింది. ఆమె వర్చస్సును చూసి దేవతలంతా ఆమెను సువర్చల అన్నారు. ఆమె పుడుతూనే నాన్నగారూ అంటూ సూర్యుడి దగ్గరకే వెళ్ళిపోయింది.

అప్పటికి సూర్యుడిలోని తేజస్సు చాలా మటుకు తగ్గి, తట్టుకోడానికి అనుకూలంగా రూపొందాడు.

అప్పటినుంచీ సంజ్ఞాసూర్యుల కాపురం చక్కబడింది. కొత్తగా పుట్టిన అశ్వినీ దేవతల పంట పండింది.

వాళ్ళు పెరుగుతున్న కొద్దీ వాళ్ళలోని వైద్యవిద్య అప్రయత్నంగా పెల్లుబికి రాసాగింది. గురుకులంలో బృహస్పతి గారి దగ్గర ఏ వేద మంత్రం చదివినా, దానిలో వైద్య పరమైన అర్థమే వారికి స్ఫురిస్తోంది.

ఒకసారి ఖేలుడనే రాజర్షికి ఒక యుద్ధంలో కాలు పూర్తిగా విరిగిపోతే, ఈ అన్నదమ్ములిద్దరూ తాతగారి సహాయంతో ఒక ఇనుప కాలు తయారు చేయించి దాన్ని ఖేలుడికి అతికించి, అతనిని మామూలుగా నడిపించారు. మరోసారి భుజ్యుడు అనే

గంధర్వుడు సముద్రంలో పడి ప్రాణావసాన దశకు వస్తే, ఈ సోదరులిద్దరూ అతనిని బ్రతికించారు.

మరోసారి ఒక మహర్షికి పురుషత్వమే లేకపోయినా వధ్రీమతి అనే కన్యను వివాహం చేసుకున్నాడు. ఇద్దరికీ ముసలితనం వచ్చేసింది. ఆ దశలో ఆ విషయం తెలిసిన అశ్వినీ దేవతలు భార్యాభర్తలిద్దరికీ వైద్యం చేశారు. ఆశ్చర్యం. పండంటి మగపిల్లవాడు పుట్టాడు. అతని పేరే హిరణ్యహస్తుడు.

ఇలాంటి సంఘటనలనేకం జరగడంతో దేవేంద్రుడు వాళ్లిద్దరినీ పిలిచి, ఆస్థాన వైద్యులుగా పదవిచ్చి, తన దగ్గరే పెట్టుకున్నాడు. కాని వైద్యులనే సరికి వాళ్ళకి కొంచెం గౌరవం తగ్గింది.

ఈ రోజుల్లో రోగాల సంఖ్య, రోగుల సంఖ్య, లెక్కకు మిక్కిలిగా పెరిగి పోయింది గనుక, వైద్యులకు సమాజంలో అపారమైన గౌరవం కనిపిస్తోంది. సమాజంలో అసలు రోగాలున్న సంఘటనలే అరుదుగా ఉంటే, ఆ నాడు వైద్యుల పరిస్థితి ఎలా ఉండి వుంటుందో ఆలోచించండి. సమాజంలో వైద్యుల ఆవశ్యకత ఎక్కువగా లేదు గనుక, వాళ్లను పిలిచేవాళ్లు, గౌరవించేవాళ్లు, తగ్గిపోతారు. అలాంటి ఆ రోజుల్లో వైద్యాన్నే వృత్తిగా తీసుకుంటే, జీవితం గడవడం కోసం, దొరికిన కొద్దిమంది రోగుల్నీ పట్టి పీడించక తప్పదు. అందుచేతే కృతయుగ కాలంలో, సమాజంలో, వైద్యవృత్తికి గౌరవస్థానం వుండేది కాదు. అశ్వినీ దేవతలు వృత్తిపరంగా వైద్యవృత్తిలో లేకపోయినా, వాళ్ళకు కూడా ఈ

సమాజపు నీలినీడల బాధ తప్పలేదు.

ఎవరిదాకానో ఎందుకు? పిలిచి ఆస్థాన పదవి ఇచ్చి గౌరవించిన దేవేంద్రుడే వీళ్లిద్దరికీ యజ్ఞాలలో హవిర్భాగాలను యివ్వడానికి తిరస్కరించాడు.

నిజానికి అశ్వినీ దేవతలు ఆజాన దేవతలు. అంటే జన్మతోనే దేవతలుగా పుట్టిన వాళ్లు. కల్పాంతం వరకూ దేవతలుగా వుండే వాళ్ళు. పైగా దేవరాజ్యంలో అధికార పదవిలో వున్నవాళ్ళు. అందుచేత వేద ప్రమాణాన్ని బట్టి వాళ్ళకు యజ్ఞ భాగాలు రావాలి. ఐనా సరే, దేవేంద్రుడు దాన్ని వీరికి దక్కనీయడం లేదు. ఈ కుర్రవాళ్ళు కూడా మిసమిసలాడుతూ, విలాస జీవనానికి అలవాటు పడి వున్నారే కాని, దేవేంద్రుడితో పోటీ పడగల పరాక్రమం వీళ్ళకు లేదు. అందువల్ల వీళ్లు మౌనంగా ఉండి పోయారు.

కాని ఒకసారి అశ్వినీ శాస్త్రం అనే అశ్వవిద్యను ఎవరు నేర్చుకోవాలి? – అనే విషయంలో దేవతలకు వాగ్వాదం వచ్చింది. వాదం ఎటూ తేలక, చివరికి పెద్దలంతా చేరి, ఒక ఒడంబడిక ఏర్పాటు చేశారు. సహజంగానే రథాన్ని అందరికన్నా వేగంగా నడపగలవాళ్ళకే ఈ విద్యను దక్కించాలి–అనేదే ఆ ఒడంబడిక.

దాంతో రథాల పందెం మొదలైంది. దేవేంద్రుడు కూడా స్వయంగా ఆ పందెంలోకి దిగాడు. పెద్ద పెద్ద దేవ వీరులంతా ఉత్తమజాతి అశ్వాలను రథాలకు కూర్చుకుని పోటీకి సిద్ధంగా నిలబడి వున్నారు.

ఇంతలో ఎవరూ ఊహించని రీతిలో, రథానికి గాడిదలను కట్టుకుని అశ్వినీ దేవతలు ఇద్దరూ ఒకే రథం మీద నిలబడి పోటీకి సిద్ధమయ్యారు. అందరూ పక్కున నవ్వారు.

కాని తీరా పోటీ మొదలయ్యే సరికి, మూడు రథాలే ముందున్నాయి. మిగిలినవన్నీ వెనుకబడి పోయాయి.

ఒకపక్క దేవేంద్రుడు, మరోపక్క అగ్నిదేవుడు, మధ్యలో అశ్వినీదేవతలు! ఈ రథాలు మూడూ సమ ఉజ్జీగా సాగిపోతున్నాయి. కాని క్రమక్రమంగా అశ్వినీదేవతల రథమే కొంచెం ముందుకు సాగుతోంది. దాన్ని గమనించి, ఇంద్రాగ్నులిద్దరూ అశ్వినీ దేవతల రథానికి అడ్డం రావడం మొదలు పెట్టారు. అడ్డం వస్తూ వాళ్లే సంప్రదింపులు కూడా మొదలు పెట్టారు–

(సశేషం)

శ్రీమతి & శ్రీ కె.పి. ప్రభాకర్ అయ్యర్ గార్ల ఏకైక పుత్రుడు
**చి॥ పి. రామస్వామి అయ్యర్ (రమేష్)**
శ్రీమతి & శ్రీ ఎ. సూర్యనారాయణ గార్ల పుత్రిక
**చి॥ల॥సౌ॥ బాలత్రిపురసుందరి (జ్యోత్స్న)** ల
వివాహం 16.2.2008 స్థిరవారం చీరాలలో జరిగింది.
**ఈ నూతన దంపతులపై శ్రీగురుదేవుల కృపాశీస్సులు వర్షించు గాక!**

శ్రీమతి & శ్రీ గాదేపల్లి సుబ్రహ్మణ్యం గార్ల ఏకైక పుత్రుడు
**చి॥ నాగేంద్ర ఈశ్వర్**
శ్రీమతి & శ్రీ చాడ శేషగిరిరావు గార్ల ఏకైక పుత్రిక
**చి॥ల॥సౌ॥ రత్నకుమారి** ల
వివాహం 21.3.2008 శుక్రవారం అన్నవరంలో జరిగింది.
**ఈ నూతన దంపతులపై శ్రీగురుదేవుల కృపాశీస్సులు వర్షించు గాక!**

# ఆత్మదానమ్ము



శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ

**(జరిగిన కథ – అత్రి అనసూయా దంపతులకు ఎన్నో జననం, దత్తాత్రేయ జననం జరిగాయి. బాలదత్తుడు ఆశ్రమపదం మొత్తానికి ప్రాణప్రియుడుగా మారాడు. అతని అల్లరి చేష్టలే యోగీశ్వరులకు కొత్త మెట్లను అందిస్తున్నాయి. తల్లికి అతనిమీద వల్లమాలిన ప్రేమగా వుంది. అతనికి ఉపనయనం గూడా జరిగింది. ఓ రోజు రాత్రివేళ అత్రి అనసూయలిద్దరూ తపస్సమాధులలోంచి బయటకు వస్తూ "పరమేశ్వరుడు దర్శనమిచ్చాడు" అనే మాట ఒకేసారి అన్నారు. అప్పటినుంచీ అనసూయామాతకు అడవంతా తిరిగి తిరిగి చూడాలనే ఆశ పెరిగిపోయింది. అత్రిమునీంద్రులు దానికి అనుమతి యిచ్చి, తను వేరే పని వుండి పట్నానికి వెళ్లారు. వనదేవి అనసూయామాతను దగ్గరుండి అడవిదారుల వెంట తిప్పుతోంది. ఇక చదవండి..)**

ఐదో రోజు అనసూయామాత మళ్లీ బయలుదేరింది. వనదేవి దారిలో కలసింది. తనూ తోడు వస్తానంది. ఆమె కార్యభారం అనసూయామాతకు తెలుసు. అదీ గాక తనకు ఏకాంతంగా తిరగాలని వుంది. ఆమె వనదేవిని వద్దని, తనే బయలుదేరింది. "జాగ్రత్త సుమా! నేను చూపించిన దారుల్లోనే పో. కొత్తదారుల్లో పడిపోకు. ప్రమాదం" అని జాగర్తలు చెప్పి వనదేవి వెళ్ళిపోయింది. ఆ రోజున అనసూయామాత మహోల్లాసంగా అడవంతా తిరిగి అగ్నిహోత్రాల వేళకు ఇంటికి తిరిగి వచ్చింది.

ఆరో నాడు ఉబలాటం ఆపుకోలేక ధైర్యం చేసి, దగ్గరి దగ్గరి కొత్త దార్లు తడిమి చూసింది. కొంగ్రొత్త వనసౌందర్యాలు వివృతాలై ఆమెకు మహానందమైంది. దారి తప్పకుండానే యింటికి వచ్చింది. ఆనాటి సాయంకాలం తాను చూపని ఒక కొత్త డొంక వెంబడి ఊరు చేరుతున్న అనసూయామాతను చూసి వనదేవి ఇదేం పని అని నిలదీసింది. ఎన్నడూ లేంది, అనసూయామాత

ఆమెను తటాలున విసుక్కుంది.

వనదేవి నివ్వెరపడి చిన్నబుచ్చుకుంది. అనసూయామాతకు తన మీద తనకే ఆశ్చర్యమైంది. "ఈ వనదేవి నన్నిక్కడ కన్నతల్లిలా కాచుకొని వుంటోంది. నేనింత మొటుదాన్నయ్యానేమిటి?" అని. ఆమె తనను తనే సవరించుకొని, వనదేవిని బ్రతిమాలి, వెంటబెట్టుకొని పర్ణశాలలకు తెచ్చింది.

మరునాటి ఉదయం అనసూయమాత కెందుకో కొంచెం బిర్ధకంగా వుందనిపించింది. తిరిగి తిరిగి బడలికైందేమో అనిపించింది. ఐనా సరే, తిరగాలనే కాంక్ష ఆగకుండా వుంది. ఆమె మెల్లగా బయలుదేరింది.

కాలు వాకిట్లో పెట్టింది. ఎదురుగా వనదేవి వస్తోంది. మంచి శకునమైందని అనసూయామాత సంతోషించింది. వనదేవి ఒక చూలి లేడిని అలవోకగా నడిపిస్తోంది. ఆ చూలింత లేడి అనసూయామాతను చూడంగానే ఉత్సాహ బలంతో ఓపిక తెచ్చుకొని, పరుగు పరుగునవచ్చి, చెవులూ తోకా ఆడిస్తూ అనసూయామాత కాళ్ళకు చుట్టుకుంది. అనసూయామాత గూడా "జాగ్రత్త జాగ్రత్త" అంటూ ఆ లేడిని ముద్దు చేయసాగింది. వనదేవి దగ్గరకు వచ్చింది.

"చూస్తూ చూస్తూ దీన్ని ఇలా వదిలేశావేమిటమ్మా?" అనసూయామాత లేడిని ఇంకా ముద్దు చేస్తూనే అడిగింది.

'నేనేమి చేసేది? దానికి నువ్వంత ముద్దొచ్చావు" వనదేవి తన సహజ ధోరణిలో మాట్లాడింది.

"నేను ముద్దు రావటమేమిటి?" అనసూయామాత విసుగును ఎలాగోలా ఆపుకుంది.

'ఏమిటేముంది? అది నిండు చూలింత. నువ్వు లేత చూలింత"

"బాగుంది నీ వరస"

"నువ్వంతకన్నా బాగున్నావు"

"నేను కొత్తగా బాగుండటమేమిటి?"

'ఔనమ్మా! నువ్వు కొత్తగానే వున్నావు. రోజూ లాగా లేవు. కులపతులు

లేరని నువ్వు జుట్టు దువ్వుకోలేదు. దాంతో నీ శోభ రెట్టింపైనట్లుంది. నీ ముఖంలోనూ, నడుములోనూ గూడా ఒక నిండుతనం వచ్చింది. ముఖంమీద అంగరాగాలు పూసుకోలేదు గానీ, లోపలి నుంచీ ఏవో కొంగ్రొత్త కాంతులు ఎగదోసుకొచ్చి అంగరాగాలు పూసినట్లే వుంది. ఆ నడకలు చూడు, ఒక కొత్త విలాసం వచ్చినట్లుంది. అబ్బ యెంతని చెప్పేది? చారు సర్వాంగివి- అని ఊరుకుంటాను. ఆశ్రమ మృగాములకు గూడా ఇలాగే వున్నావని ఇప్పుడు తెలుస్తోంది. ఇక పురుషులకెలా వుంటావో?!"

"చాల్లే ఐడాయి! ఇక నేను పోవాలి"

"నన్ను తోడు రానీ రాదా?"

"దీన్ని వదిలి ఎలా వస్తావే. ఒకటి రెండు ఘడియల్లో కనబోతున్నట్లుగా వుంది." అనసూయామాత మాటల్లో కరుణ పొంగింది.

"మరి నిన్నెట్లు వదిలేది?"

"నాకు పరమేశ్వరుదున్నాడులే"

అనసూయామాతకు అప్పుడే రవ్వంత విసుగొచ్చింది. వనదేవి యింకా పెంచ లేదు. అనసూయామాత ముందుకు సాగింది.

పొద్దు నడిమింటికెక్కింది.

అనసూయామాత అడవి దారుల వెంట నడుస్తోంది. ఆమెకు తెలియక, ఎక్కడో దారి తప్పినట్లుంది. మునుపు చూడని కొంగ్రొత్త వనభూముల్లోకి ఆమె ప్రవేశించింది. అక్కడ చాలా క్రూరమృగాలున్న జాడ కనిపిస్తోంది. అయినా ఆమెకు భయం కలగలేదు. ఆ సాంద్రారణ్యంలో ముందుకు సాగుతూ చిన్న గుట్టలు, సెలయేళ్ళు, మొదలైనవి చూసి ఆమె మురిసి పోతోంది. మిట్ట మధ్యాహ్నమైనా, అది సాంద్రారణ్యం కనుక అక్కడ సూర్య భగవానుడి ప్రతాపం చెల్లటం లేదు.

ఆ సరికి అనసూయామాత సురపొన్న చెట్లతో శీతలమైన ఒక ప్రాంతానికి చేరింది. ఆమెకు కొంచెం అలసటై ఆ సురపొన్నల నీడల్లో, ఏకాంతం గనుక

స్వతంత్రంగా, యథేచ్ఛగా, అలవోకగా, అటూ ఇటూ నడుస్తోంది.

అంతలో భయభ్రాంతమైన మృగశాబక మొకటి ఆమె పక్కనుంచీ దూసుకు పోయింది.

ఆమె "ఇదేమిటా అనుకొంటూ వుండగానే, ఒక బాణం రివ్వున ఆమె చెవుల పక్కగా దూసుకు పోయింది. ఆమె ఉలిక్కి పడి, వెనకకు జరిగి, చూసేటంతలో సన్నగా కూత పెడుతూ లేడిపిల్ల అల్లంత దూరంలో కుప్ప కూలింది.

అది మరణించిందని ఆమె భావించింది గానీ, అంతలో ఆ లేడికూన లేచి మళ్ళీ పారి పోయింది. పక్కనున్న రాతి నేలలో ఆ బాణం దిగబడి సగం విరిగింది.

అనసూయామాత "హమ్మయ్య" అనుకొని ఊపిరి పీల్చుకునేటంతలో, సుడిగాలి లాగా డెక్కల సవ్వడి, ఒక పురుషుడు కంఠం సవరించుకుంటున్న ధ్వని వినవచ్చినై.

అనసూయామాత తటాలున తలతిప్పి చూసింది. ఎవడో మృగయావ్యసన పరుడైన రాజాధికారి లాగా ఉన్నాడు. ఆమెను చూసి, తటాలున కళ్లెం లాగి, గుఱ్ఱం ఆపి, దిగాడు.

"మూర్ఖుడి లాగా వున్నాడు. ఆశ్రమ మృగాలను పీడిస్తాడేమిటి?" అనసూయామాతకు అక్కడ ఉండబుద్ధి కాలేదు. వాణ్ణి అంతకన్నా పరిశీలించి చూడబుద్ధీ కాలేదు.

ఆమె గిర్రున వెనక్కు తిరిగింది. ఆ తొట్రుబాటులో ఆమె కొప్పు జారి, మోకాళ్ళ వరకూ కప్పింది. ఆమె నడకలు అలసమంథరాలుగా ఉన్నై.

వెనుకనుంచీ ఒక సన్నని ఈల, దాని వెంబడే 'సుందరీ! కొంచెం ఆగు" అనే మాటలు, వినిపించాయి.

ఆమె తోక త్రొక్కిన తాచులా చర్రున వెనక్కు తిరిగి చూసింది.

వాడు సన్నగా నవ్వుతున్నాడు. వాడు నవ్వుతుంటే వాడి పెదవులమీద అదురుతున్న మీసాలు మంద్రగబ్బ కొండేల లాగా ఉన్నై. తలమీది రత్నాల పాగలో

వున్న తురాయి, తలలోంచీ పొడుచుకు వచ్చిన చురకత్తి లాగా వుంది. తగిలించు కొన్న లోహ కవచంవల్ల వాడొక  ఖడ్గ మృగం లాగా ఉన్నాడు.

నిప్పులు రాలుతున్న ఆ తల్లి కళ్ళు చూసి వాడు వెకిలి నవ్వు నవ్వుతూ "సుందరీ! ఈ అడవి సొగసంతా నీ కళ్ళలో గూడు కట్టిందే. ఇంతకూ నువ్వెవరు?" అన్నాడు.

ఆమె పలక లేదు.

"అడవిపిల్లకు సిగ్గులు కూడా తెలుసునే! సరే గాని మేమెవ్వరమో తెలుసా? హైహయ మహా ప్రభువులం." వాడే మళ్ళీ అన్నాడు.

ఆమె మౌనంగా నిలిచి పోయింది.

"సుందరీ! నీ పంట పండింది. మేము నిన్ను వలచాం. రా. మా హృదయ సామ్రాజ్యం ఏలుకో"  బెబ్బులి పంజా విసిరినట్లు వాడు చేయి చాచాడు.

ఆ తల్లి చిరాశ్యస్తాలైన తన సంయమ శక్తులన్నీ కేంద్రీకరించుకొని హృదయం లోకి చేరిన ప్రతీకార వాంఛలన్నిటినీ దూరం చేసుకొంటూ, గిర్రున వెనక్కు తిరిగి అడుగు ముందుకు వేసింది.

హైహయుడు "ఎక్కడికి పోతావే" అంటూ తటాలున ఆమె చేతిని పట్టుకున్నాడు.

దుఃఖామర్ష భయోద్వేగంలో ఆమె కెవ్వున అరచి, ఒళ్ళు మరచి, ప్రక్కనున్న చెట్టు బోదెమీద తూలి పడిపోయింది.

మరుక్షణంలో పిడుగుపాటు వంటి మహాకారాలతో, ఆమె గర్భమునుంచీ పిండం నేలకు రాలింది!!!

రాలటమే తడవుగా, ఆ పిండం ఒక మహేంద్రజాల క్రియ లాగా పనిచేసి, క్షణాల్లో ఎదిగిపోయి, పెనుగడ్డాలు మీసాల నడుమ, క్రోధావేశంతో చిటపటలాడే ముఖం గల ముని యువకుడై వెలిసింది.

పుట్టీ పుట్టటంతోనే ఆ ముని కుమారుడు "అరే" అంటూ ఒక పెను ఫీంకారం చేశాడు.

మరుక్షణంలో హైహయ హతకుడు బాడిద రాశై పోయాడు.

ఆ ముని కుమారుడు మరికొంత సేపలాగే క్రోధావేశంతో చరచరలాడుతూ నిలబడ్డాడు. అప్పటికి అతనికి తల్లి గుర్తుకువచ్చినది కాబోలు, ఆమె వంక చూశాడు.

ఆ తల్లి వృక్ష మూలం దగ్గర వెల్లకిలా పడి వుంది. ముని కుమారుడు తన కమండలోదకం ఆమె ముఖం మీద చల్లి స్పృహలోకి వస్తున్న తల్లిని లేవదీసి, కూర్చోబెట్టి "అంబా! అంబా!" అంటూ ఆమె పాదాలమీద వాలి, ఆ పాదాలు తన నెత్తిన పెట్టుకొని, చాలాసేపలాగే వుండిపోయాడు.

ఆ తల్లి అయోమయపు చూపులతో తన పుత్రుణ్ణి పరిశీలిస్తూ అలాగే కూర్చుండి పోయింది. అతను లేచి నిలబడ్డాడు.

చూపులకు ఇరవై యేళ్లవాడి లాగా ఉన్నాడు. నల్లటి గడ్డాలు, మీసాలు; జడలు చిందర వందరగా ఉన్నై. బుజం మీద మౌంజీ యజ్ఞోపవీతాలున్నై. ఫాలభాగమంతా భస్మం పులుముకొని వుంది. భ్రూమధ్య భాగంలో పెద్ద కాసంత బొట్టు ఎగుడు దిగుళ్లుగా వుంది. నడుముకో బొంతవంటి వల్కలం చుట్టి వుంది. ఒక చేతిలో కమండలం వుంది. వేరొక చేతిలో మంత్ర దండం వుంది.

వాణ్ణి చూసి చూసి , ఆ తల్లికి ఆనందం పొంగు కొచ్చింది. "వీడిలో అంతరమైన ఆనందం వీడి మొహంమీద తాండవిస్తోంది." అని ఆమె అనుకొనే లోపలే అతని మొహం మళ్ళీ చిటపటలాడసాగింది.

"అంబా! ఈ లోకమే పాపిష్ఠం. రాజులే ఇలా ఏడుస్తుంటే ప్రజలకు గతేమిటి? ధర్మానికి స్థితేమిటి? ఐనా, అంబా! భయపడకు. నేనున్నా. అంబా! నా భుజంమీద పెట్టుకొని నిన్నింటికి తీసుకుపోతా, రా" గత ఇరవై ఏళ్ళుగా ఆమె దగ్గరే పెరిగినట్లు మాట్లాడేస్తున్నాడు. ఆ తల్లికి వాత్సల్యము, దుఃఖము, కలిసి పొంగుతున్నై. "నా చిట్టి తండ్రీ! నీవల్ల బ్రతికారా" అంటూ ఆమె పుత్రుణ్ణి కౌగిలించుకొని తలకాయ వాసన చూసింది.

మునికుమారుడిభుజం మీదెక్కి వస్తున్న అనసూయామాతను చూసి

ఆశ్రమ వాసులంతా నివ్వెరపోయి, ససంభ్రములై ఆమె చుట్టూ చేరారు. సహజంగానే ఋజుశీలమైన ఆ ఆశ్రమ జీవనంలో వారికి అరమరికలు లేవు. ఆమె జరిగినదంతా వారికి వివరించింది. వాళ్ళంతా ఆశ్చర్యపడి "అలాంటి తపోరాసులైన పుణ్యాదంపతులకు ఇలాంటి తపోరాశిగాక మరోడెలా పుడతాడు? సింహానికి సింహమే పుడుతుంది" అని తమలో తాము చెప్పుకొని మహోల్లాస పడ్డారు.

అత్రి తృతీయ పుత్రుడు మాత్రం ఈ జన సమ్మర్దాన్నీ, ఈ స్తోత్ర వాక్యాలనూ చూసి మొహం మటమటలాడించుకో సాగాడు. అది చూసిన ముని జనులు ఇతను ఏకాంతాభిలాషిలాగా వున్నాడని గ్రహించి, అనసూయామాతకు ఆమాటే చెప్పారు.

ఆమె గూడా కొంచెం ఆలోచించి పెద్దల అనుమతి తీసుకొని, ఆ కుర్రవాడ్ని ఇంట్లోకి తీసుకుపోయి, ఓ మూల కూర్చోబెట్టింది. అంతే అతను మరు నిముషంలోనే సమాధి గతుడయ్యాడు.

ఆ కూర్చోటం కూర్చోటం మరునాడు అత్రిమునీంద్రులు వచ్చి అతని ఎదుట నిలబడేదాకా అలాగే కూర్చుండి పోయాడు. మునీంద్రులు ఎదురుగా వచ్చే సరికి ఎవరో తట్టి లేపినట్లు తటాలున లేచి, తండ్రి పాదాలు పట్టుకొని నమస్కరించాడు. మునీంద్రులకు అప్పటికే కథంతా తెలిసింది. వారు పుత్రుడ్ని లేవనెత్తి మూర్ధ మాఘ్రాణించి, "చిరంజీవ" అని దీవించారు.

ఆ తరువాత ఓ పక్కన నిలబడి ముసి ముసి నవ్వులు నవ్వుతున్న అనసూయామాతను చూసి, "కళ్యాణీ! భద్రమస్తు" అని నవ్వారు.

(సశేషం)

**గుణదల వెంకట నరసమ్మ గారు**

**3.2.2008 ఆదివారం స్వర్గస్థులైనారు.**

**శ్రీగురుదేవుల కృపవల్ల వీరి ఆత్మకు శాంతి చేకూరి ఉత్తమ సద్గతి లభించుగాక!**




## విభూతిపాదము

**18వ అధ్యాయం.. జన్మసిద్ధి**

(గత సంచిక తరువాయి)

*త్వం మంత్రసిద్ధః ప్రణవాత్మకోఽసి*
*లీనాంతరంగోఽపి చ యోగసిద్ధః।*
*త్వం జన్మసిద్ధోఽసి సమాప్తకామ*
*స్సిద్ధే రసిద్ధేశ్చ గురో! పరోఽసి॥*

(గురుదేవా! మీరు స్వయంగా ప్రణవ స్వరూపులు గనుక మంత్రసిద్ధులు. మీ మనస్సు లయించింది గనుక యోగసిద్ధులు. భూతభవిష్యద్వర్తమాన కాలాలలోని మీ కోరికలన్నీ తీరాయి గనుక జన్మసిద్ధులు. నిజానికి మీరు సిద్ధికి, అసిద్ధికి గూడా అతీతులు.)

### గీటురాయి

1967 జూలైలో మళ్ళీ కేరళ పర్యటన జరిగింది. ఈ పర్యటనలో స్వామీజీ కొచ్చిన్, ఎర్నాకులం, తర్పుణతుర, గురువాయూర్ సందర్శించారు.

పర్యటన ముగించుకొని, ఆయన మైసూరు వచ్చేసరికి ఆశ్రమంలో నరసింహశాస్త్రిగారు ఉన్నారు.

నిజాని కాయన, తన కొడుకు సొంత కుటీరం ఏదో వేసుకున్నాడని తెలిసి, చూచి సంతోషిద్దామని వచ్చాడు. కాని, యిక్కడికి వచ్చాక, సంతోషం మాట అలా వుండి, కెసరేలో గలిగిన తృప్తి గూడ తగ్గిపోయింది. దాంతో ఆయన వీలయినంత యెక్కువమందితో మాట్లాడి వీలయినంత యెక్కువ ఆచూకీ రాబడదామని ప్రయత్నించ సాగాడు. వ్యవహార సౌకుమార్యం బొత్తిగా యెరగని తను యీ ప్రయత్నంలో వెర్రిగా ప్రవర్తిస్తున్నాననీ, తన ప్రవర్తన వల్ల కొడుకుకి గొంతులో వెలక్కాయపడిన సంకటంగా వుందనీ ఆయనకు తెలీటం లేదు. భక్తులలో తన విలువ తనే పోగొట్టుకుంటున్నానని గూడా ఆయన

గమనించుకోవటం లేదు. ఆయన ఆదుర్దా ఆయనది. ఆ ఆదుర్దాలోనే ఆయనిలా ఆలోచించసాగాడు.

"క్రిందటిసారి వచ్చినప్పుడు, వీడెవర్నీ ప్రత్యేకంగా డబ్బులడగటం లేదనీ, పదిమందికీ ఉపకారం చేస్తున్నాడనీ సంతోషించాను. కాని ఇప్పుడు వీడి పద్ధతి చూస్తే ఇలా మారిపోయిందేమిటి? కుటీరమనే పేరుతో నాలుగెకరాల పొలం కొన్నాడు. ఎవరి దగ్గర గుంజాడీ డబ్బు? పైగా దాంట్లో ఇల్లు కట్టించాడు. ఇవాళ్ళ తాటాకుల పాక కాస్త రేకులషెడ్డుగా మారితే, రేపో యెల్లుండో అది డాబాగా మారదా? ఇలా పొలాలు, ఇళ్ళూ, కార్లూ వీటిమీద దృష్టి పడితే, వీడికింక యేమి ఉపాసన వున్నట్టు, నా బొంద!"

"కిందటిసారి వీడి పద్ధతంతా వైదికమార్గంగానే వుందనుకున్నాను. కాని యీ మాటు వీడు యీ సంగీత వాద్యాలు పెట్టుకొని గంతులెయ్యటం ఎక్కువగా వుంది. మా సూరప్పగారు సంగీతంతో తరించాడంటే అది యీ పద్ధతా? అసలయినా, ఆ తరం వేరు. ఆ తాహతు వేరు. పైగా వీడు యీ వీణలు, హార్మోనీలు పెట్టుకొని, భజనలు నేర్పుతానని ఆడపిల్లల్ని చుట్టూ వేసుకొని కూర్చుంటున్నాడు. సూరప్పగారిలా చేశాడా? ఇవాళ్ళ ఏదో నాలుగు మహిమలు చేసి చూపిస్తే నలుగురు జనం వెంట బడవచ్చు. రేపెవడికో తలకు మించిన కర్మ వచ్చి నెత్తిన బడుతుంది. అప్పుడు తప్పించటం కుదరదు. కుదరకపోతే, ఇలా డబ్బులు దోచి యిళ్ళు కట్టించి యిచ్చిన వాళ్ళు వూరుకుంటారా? కీళ్ళు తీస్తారు. దాని సంగతేమి ఆలోచించినట్టు వీడు?

"అసలదీగాక, వీడు చేసే ఉపాసన యేమిటి? వీడు సాధించిన విద్య లేమిటి? తస్కరిణి విద్యతో యెక్కడైనా విగ్రహాలు వుంటే లాక్కొస్తున్నాడా? అలా అయితే, అది కేవలం దొంగతనం, అది నీచాతినీచం, ఘోర నరకప్రదం. లేదా, కేవలం ఇంద్రజాల తంత్రాలు ఉపయోగిస్తున్నాడా? అలా అయితే, ఆ వస్తువులు శాశ్వతంగా వుండవు. లేదా, యే యక్ష, గంధర్వాదులనో వశం చేసుకొని బడబుక్కల పని చేస్తున్నాడా? అలా అయితే, అది అధర్మమే గాక అవమానం గూడాను. ఏ మహామంత్రానుష్ఠాతో వస్తే, యీ యక్ష, గంధర్వ శక్తులన్నీ

పటాపంచలయి పోతాయి. ఒకోసారి అవి ఎదురు తిరిగి వీడికే అపకారం చెయ్యవచ్చు. ఏమయినా యిలాంటి క్షుద్రశక్తులను ఆరాధించేవారు రాజులను వదిలి ద్వారపాలకుల్ని ఆశ్రయించే వారు మాత్రమే. వారికి యిక సత్యమయమైన మోక్షమార్గంలో ప్రవేశం లేదు.

"మహామంత్రానుష్ఠాన సిద్ధి ద్వారాగాని, యోగసిద్ధి ద్వారా గాని, వీడికి సిద్ధి లభిస్తే, అప్పుడు భయం లేదు కాని, లేకపోతే, తండ్రినై వుండి నేను చూస్తూ వూరుకోరాదు. అది మన వంశానికే అప్రతిష్ఠ. అందుచేత వీడి సిద్ధులకు అవధి యేమిటో, వాటి విధానమేమిటో జాగర్తగా పరిశోధన చెయ్యాలి, తప్పదు. సమస్త క్షుద్రవిద్యలనూ నిర్వీర్యం చెయ్యటానికీ, అవతల వ్యక్తిలో అధార్మికమైన, ఇంద్రియలోలములైన స్పందనలు వుంటే గుర్తించటానికి మన దగ్గర నరసింహం వుంది. భయం లేదు. నరసింహుడు అగ్నిమూర్తి. చల్లనితల్లి గాయత్రిని గూడా అనుసంధానం చేస్తే, ఇక క్షుద్రాలకు యీ చుట్టుపక్కలలో నిలువ నీడ వుండదు. అందుచేత, ఇక ఆ రెండు విద్యలనూ ప్రయోగించి, వీడి సంగతి నఖశిఖ పర్యంతం పూర్తిగా పరీక్ష చేద్దాం. అది నా ధర్మం కదా!"

ఇంత దీర్ఘమయిన ఆలోచన చేసి, ఇక ఆయన మంత్రానుష్ఠానం ప్రారంభించాడు. పని మొదలుపెడితే ఇక రాత్రింబగళ్ళతో లెక్క వుండటం ఆయనకు జన్మ లక్షణం కాదు. ఒక పదిరోజులు తీవ్రానుష్ఠానం చేసి, బహువిధాలుగా పరిశీలించి తన కొడుకులో గాని, ఆయన చుట్టూ తిరిగే వారిలో గాని పాపపు చింత లేమీ వుండటం లేదని నిశ్చయించుకున్నాడాయన. అక్కడికి కొంత తృప్తి అయింది. ఈ తృప్తి కలగంగానే, తన మకాం ఆశ్రమం లోంచి, పెద్ద కూతురు వరలక్ష్మిగారి యింట్లోకి మార్చేశాడాయన.

(సశేషం)

భక్తిమాల ఎన్వలప్‌పై మీ చందా ముగింపు తేదీ వున్నది. దీన్ని గురించి వేరే నోటీసు రాదు. కనుక దయచేసి ప్రతినెలా ఎన్వలప్‌ను గమనించి మీ చందా ముగిసేందుకు తగినంత ముందుగానే మళ్లీ చందా కట్టి, భక్తిమాల అభివృద్ధికి సహకరించ ప్రార్థన. అడ్రసు మారినచో పాత, క్రొత్త అడ్రసులను తెలుపుతూ, ఒక పోస్టుకార్డు వ్రాసినచో భక్తిమాల నిరంతరంగా మీకు చేరుతుంది.




శ్రీశంకర భగవత్పాదాచార్యకృత స్తోత్రావళి

సరళ వ్యాఖ్యానము

**శ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీ**

*(గతసంచిక తరువాయి)*

**22 వ శ్లోకము**

రథ్యాచర్పట విరచితకంథః
పుణ్యాఽపుణ్యవివర్జితపంథః
యోగీ యోగనియోజితచిత్తో
రమతే బాలోన్మత్తవదేవ॥
భజగోవిన్దం భజగోవిన్దం
గోవిన్దం భజ మూఢమతే।

భావం: వీధుల్లోపడిన గుడ్డపీలికలతో తయారైన బొంత ధరించి, పుణ్యపాపాలకు సుదూరమైన మార్గంలో నడిచేటువంటి యోగి, యోగంచేత ఏకాగ్రచిత్తం కలవాడై బాలునిలాగాను, పిచ్చివానిలాగాను ఆనందిస్తూంటాడు.

"బాలోన్మత్తపిశాచవత్" 'కదా యోగీ కదా భోగీ నగ్నః పిశాచవత్' అని దత్తాత్రేయస్వామినిగురించి చెపుతారు. అవధూత లక్షణాలిలాగే వుంటాయి. నిజానికి వారు జీవన్ముక్తులు. పిల్లల్లాగా కేరింతలు కొడతారు. పిచ్చిపట్టినట్లు వెర్రిగా ప్రవర్తిస్తారు. దయ్యం పట్టినట్లు కేకలువేస్తూ గంతులేస్తూంటారు. వారికిది విధి అనిగాని యిది నిషిద్ధమనిగాని వుండదు. గుణదోషాలులేవు. పాపపుణ్యాలు వుండవు. అలాగే సుఖ దుఃఖాలూ వుండవు.

అంటే వాళ్ళు ఎలాంటి పాపకార్యమైనా చేస్తారనుకోరాదు.

వారు పరిపూర్ణ స్వతంత్రులేకాని పరాధీనులు కారు. వారిని చూస్తే అపార్థం కలుగుతుంది. ఇతరులయందు సానుభూతి లేనివారుగా కనబడవచ్చు. వారి ప్రవర్తన యితరుల కేమాత్రం అంతుపట్టదు. త్రిగుణాలకు వారు అతీతులు.

"నిస్త్రైగుణ్యే పథి విచరతాం కోవిధిః కోనిషేధః" త్రిగుణాతీత మార్గంలో సంచరించే మహనీయులకు ఏది విధి? ఏది నిషేధం?

వారి మనస్సు సర్వావస్థలయందూ బ్రహ్మాత్మస్థితిలో లయమై వుంటుంది. బ్రహ్మాండమంతా తానై వుంటుంది.

అలాంటి యోగారూఢులయిన బ్రహ్మణ్యులకు దేశకాలాలు శీతోష్ణాదిద్వంద్వాలు ఏవీ వుండవు.

దిగ్దేశకాలాద్యనవేక్ష్య సర్వగం
శీతాదిహృన్నిత్యసుఖం నిరంజనం
యఃస్వాత్మ తీర్థం భజతే వినిష్క్రియః
స సర్వవిత్సర్వగతోఽమృతో భవేత్॥

దిక్కులు, దేశాలు, కాలం మొదలయి హద్దులను అతిక్రమించి శీతోష్ణాది ద్వంద్వాలకు అతీతమై నిర్మలమై, నిత్యమూ సుఖస్వరూపమైన ఆత్మ అనే తీర్థాన్ని ఎవడు నిష్క్రియుడై సేవిస్తాడో అతడే సర్వజ్ఞుడు, సర్వవ్యాపి. అమృతుడున్నూ అవుతాడు అని భావం. అలాంటివారినే ఈ శ్లోకంలో చెప్పారు.

జ్ఞానులెప్పుడూ ఏమీ తెలియని అమాయకుల లాగానే కనబడతారు. ఏమీ తెలియని వారికే బాహ్యాడంబరాలు. ఎల్లప్పుడూ బ్రహ్మానందంలో మునిగితేలే వారికిలాంటివేవీ పట్టవు. పట్టించుకోరు.

(సశేషం)

# దత్తపదీయం - 13

**- రాణీ -**

**గమనిక**

**దత్తపదీయం - 12 సమాధానాలు**

201) బి; 202) ఎ, 203) డి, 204) బి, 205) ఇ, 206) సి, 207) సి, 208) బి, 209) ఎ, 210) ఎ, 211) సి ; 212) డి 213) సి, 214) ఎ, 215) డి, 216) బి, 217) సి, 218) ఇ, 219) ఇ, 220) బి.

పాఠకులందరు పాల్గొని సమాధానాలు కవరు మీద గాని, కార్డు మీద గాని వ్రాసి, "దత్తపదీయం" C/o భక్తిమాల, దత్తపీఠం, శ్రీ గణపతి సచ్చిదానంద ఆశ్రమ, మైసూరు" అని వ్రాసి పంపించాలి.

సమాధానాలు వ్రాసి పంపించినవారికి స్వామీజీ ఆశీస్సులను అందిస్తున్నారు. భక్తిమాల మీ చేతికొచ్చిన 15 రోజులలో మీ సమాధానాలు మాకు చేరాలి.

**- సంపాదకులు.**

221) హిమవంతుడను పర్వతరాజు వద్ద గల గొప్ప నిధి
(ఎ) బంగారం (బి) నీరు (సి) మంచు (డి) ధాతువులు

222) హిమవంతుని భార్యపేరు
(ఎ) సుకన్య (బి) మనోరమ (సి) తనుప్రభ (డి) ధీమతి

223) ఆమె ఎవరియొక్క కుమార్తె
(ఎ) క్రౌంచపర్వతం (బి) మేరుపర్వతం (సి) వింధ్యపర్వతం (డి) గోవర్ధనపర్వతం

224) హిమవంతునికి గల కుమార్తెలు ఎంతమంది
(ఎ) ఒకటి (బి) రెండు (సి) మూడు

225) హిమవంతుని పెద్ద కుమార్తె
(ఎ) మాల్యవతి (బి) గంగ (సి) సునంద (డి) ఉమ

226) రెండవ కుమార్తె
(ఎ) మాల్యవతి (బి) గంగ (సి) సునంద (డి) ఉమ

227) త్రిపథగ అనగా
(ఎ) భూలోకమున ప్రవహించునది (బి) భూ–పాతాళములందు
(సి) భూ–పాతాళ–స్వర్గములు
228) లోకహితమునకై పెద్ద కుమార్తెను యాచించినవారెవరు
(ఎ) ఋషులు (బి) గంధర్వులు (సి) దేవతలు (డి) యక్షులు
229) రెండవ కుమార్తెను ఎవరికిచ్చి వివాహము చేసెను
(ఎ) బ్రహ్మ (బి) విష్ణువు (సి) రుద్రుడు
230) ఆమె పరమశివుని ఏవిధముగ మెప్పించి వివాహం చేసికొనెను
(ఎ) భక్తిశ్రద్ధలు (బి) వినయవిధేతలు (సి) ఉగ్రమైన తపస్సు
231) ఈశ్వరునియొక్క తేజస్సును ధరించినవారు
(ఎ) భూమి (బి) ఆకాశము (సి) నీరు
232) దేవతలు ప్రార్థించగ ఆ తేజస్సును తిరిగి కొద్ది భాగము స్వీకరించినవారు
(ఎ) ఆకాశము (బి) నీరు (సి) అగ్ని (డి) గంధర్వులు
233) ఎవరి సహకారముతో స్వీకరించెను
(ఎ) వాయువు (బి) ఉదకము (సి) గంధర్వ (డి) యక్ష
234) చివరకు ఆ తేజస్సు ఏ రూపమును పొందినది
(ఎ) మానవునిగ (బి) జలముగ (సి) శ్వేతపర్వతముగ
235) అచటగల శరవణమున పుట్టినవాడు
(ఎ) యక్షుడు (బి) గంధర్వుడు (సి) కుమారస్వామి
236) కుమారస్వామికి గల పేర్లు
(ఎ) అగ్ని సంభవ (బి) కార్తికేయ (సి) శరవణ భవ (డి) అన్నియును
237) ఉమాదేవి కోపములో దేవతలను ఏమని శపించెను
(ఎ) మీకు కష్టములు కలుగుగాక (బి)మీకు సంతానము కలుగ కుండుగాక
238) భూ దేవతను ఏమని శపించెను
(ఎ) అనేకమందికి భార్యవు కమ్ము (బి) పుత్రానందములేనిదానవుకమ్ము
(సి) రెండును
239) అనంతరం పరమశివుడు ఏ దిక్కుగ వెళ్ళిపోయెను
(ఎ) తూర్పు (బి) దక్షిణం (సి) ఉత్తరం (డి) పశ్చిమం
240) అచటనుండి ఉమాదేవితో ఎచటకు వెళ్ళెను
(ఎ)హిమవత్ పర్వతముయొక్క తూర్పుభాగం (బి) ఉత్తరభాగం
(సి) దక్షిణభాగం

# అనుభవాలు

**యం. మల్లిక, కరీంనగర్**

మా కుటుంబము అంత దత్తున్ని ఆరాధిస్తాము మరియు మాకు శ్రీస్వామీజీయే సర్వస్వం.

శ్రీస్వామీజీ మనకు ముందు రాబోయే ఆపదను తెలుసుకొని మనలను రక్షిస్తుంటారు. అందుకే గురు దయ చాలా అపారమైనదని ఈ సంఘటనల ద్వారా తెలిసినది.

తేది 26.11.2003 రోజున మా అక్కయ్య కూతురు పెళ్ళి అయినది. అత్తవారింటికి వెళ్ళినది. అదే రోజు రాత్రి నిద్రలో నాకు శ్రీస్వామీజీవారి మాట వినిపించినది. "తగిలితే దెబ్బలు తగలవచ్చు దత్తదర్శనం తీసుకో అని మూడు సార్లు వినిపించినది." భయంతో కళ్ళు తెరచి చూసే సరికి తెల్లవారినది. ఇలా వినిపించినదని మా వారికి మా అక్కయ్యకు విషయము చెప్పితిని. అదే రోజు రాత్రికి రెసిప్షన్ ఉంది. తప్పనిసరై వెళ్ళితని, రెసిప్షన్‌కు దత్తదర్శనం తీసుకొని వెళ్ళితే ఎవరైన ఏమైనా అనుకుంటారేమోనని అనుకున్నాను. ఐనా సరే దత్తదర్శనము తీసుకొని పోయినాను. రెసిప్షన్ వరంగల్‌లో బాగానే జరిగింది. అప్పటికి అర్ధరాత్రి ఐనది. అదే రాత్రి కారులో కరీంనగర్‌కు బయలుదేరినాము. కారులో మాబావగారు అక్కయ్య నేను మావారు మరియు నాకూతురు కూర్చున్నాం, మాబావగారు ఐన శ్రీ రాజేందర్ గారు డ్రైవ్ చేస్తున్నారు. అప్పుడు సమయం రాత్రి గం. 1.30 లు. కారు డ్రైవ్ చేస్తు చేస్తు నిద్రలోకి మాబావగారైన శ్రీ రాజేంధర్ గారు జారుకున్నారు. దాదాపుగా అందరం నిద్రావస్థలో వున్నాము. కారు పోతు పోతు ప్రక్కకు పోతున్నది. ఎదురుగా లారి వచ్చుచున్నది. అది గ్రహించిన మావారు సడన్‌గా స్టీరింగ్ తిప్పారు. కారు గిర్రున తిరిగినది. ఆ కుదుపుకు ఒక్కసారిగా దత్తా యని అరిచాను. శ్రీ స్వామీజీవారి అపారమైన కృపచే మేము కారు ప్రమాదము నుండి రక్షింపబడినాము. క్షేమముగా కరీంనగర్ చేరుకున్నాము.

ఈ విధముగా మాకు ఎన్నో అనుభవాలు జరిగినాయి. శ్రీస్వామీజీవారిని సదా మననము చేయడము వలన మనలను సదా రక్షిస్తారు. జైగురుదత్త.

# I-SERVE వారి
## ఆయుర్వేద వైద్య విధానం మీద
## జాతీయ సదస్సు మరియు శిక్షణా శిబిరం - ఒక నివేదిక

2008 మార్చి 16 నుండి 18 వరకు విజయవాడలో ఆయుర్వేద వైద్య విధానం మీద జాతీయ సదస్సు , శిక్షణా శిబిరం (సి.యం.ఇ కార్యక్రమం) నిర్వహింపబడింది. ఐ-సర్వ్ సంస్థ హైదరాబాదువారు ఈ సదస్సును యన్.యఫ్.పి.ఎ.ఎ. డెయిరీ, నెల్లూరు మరియు డా॥ ఎన్.టి.ఆర్. వైద్య విశ్వ విద్యాలయం సహకారంతో నిర్వహించారు.

శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీవారు తమ ఆశీస్సులనందిస్తూ, ఆయుర్వేద విధానం ద్వారా రోగులకు సేవలు చెయ్యాలన్నారు. ఆయుర్వేదం వేదంలాగానే సనాతన విద్య అని సెలవిచ్చారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి డా॥ వై.యస్. రాజశేఖర రెడ్డి తమ సందేశంలో తెలుపుతూ, సమాజంలోని అన్ని వర్గాలవారికీ చేరుకునే విధంగా ఆయుర్వేద వైద్య విధానాన్ని "పరిశోధనా విస్తరణ"ల ద్వారా విస్తరించటానికి గట్టి కృషి చెయ్యాలని ప్రోత్సహించారు. ఇలాటి సి.యం.ఇ శిక్షణా కార్యక్రమాలు ఇంకా నిర్వహించి ఆయుర్వేద వైద్యుల పరిజ్ఞానాన్ని మెరుగు పరుస్తూండాలని కోరారు.

డా॥ఎ.వి. కృష్ణరాజు, ఉపకులపతి, డా॥N.T.R వైద్య విశ్వవిద్యాలయం, (విజయవాడ)వారు జ్యోతిప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు.

ఆంధ్రప్రదేశ్ శాసనమండలి మాజీఉపాధ్యక్షులు, సిరీస్ ఫార్మాస్యూటికల్స్, (విజయవాడ) అధ్యక్షుడు డా॥జియస్.రాజు, చరక సంహిత వర్డ్ సర్చ్ ఇంజిన్ (సి.యస్. డబ్ల్యూ. యస్.ఇ) అనే పేరుగల సాఫ్ట్‌వేర్ ప్యాకేజిని ఆవిష్కరించారు. ఐ సర్వ్ చాలాకాలంగా ఈ ప్రాజెక్టుమీద కృషి చేసింది. దేవనాగరి లిపిలో వుండే గ్రంథాలకు కంప్యూటర్ ద్వారా డైరెక్ట్‌గా సెర్చి డ్రైవ్స్ నిర్మించటానికి ప్రయత్నించింది. దీనివల్ల కంప్యూటర్ ద్వారా పరిశోధనలు చేసే వారికి సంస్కృత గ్రంథాలు సులభంగా అందుబాటులోకి వస్తాయి. పైలట్ ప్రాజెక్టుగా "చరక సంహిత"

సంస్కృత గ్రంథాన్ని కంప్యూటర్‌కు ఫీడ్ చేయ బూనుకున్నారు. డా॥ యమ్. పరాంకుశరావు, అసిస్టెంటు ప్రొఫెసర్ , యస్.వి. ఆయుర్వేదిక్ మెడికల్ కాలేజి, తిరుపతి , శ్రీ ఎ.శ్రీకాంత్, సాఫ్ట్‌వేర్ నిపుణుడు, హైదరాబాదు , వీరిద్దరూ కలిసి సుమారు రెండేళ్లు కృషి చేసి జయప్రదంగా సాఫ్ట్‌వేర్‌ను నిర్మించి ఈ ప్రారంభ సభలో ప్రదర్శించారు. దీనికి పేటెంటు హక్కులు వచ్చేలోగా దీన్ని వినియోగించుకో దలచుకునేవారు వివరాలకు ఐసర్వ్ హైదరాబాదు వారిని సంప్రదించవచ్చు.

సి.సి.ఐ.యమ్, సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్, (మినిస్ట్రీ ఆఫ్  హెల్త్ అండ్ ఫామిలీ వెల్‌ఫేర్, న్యూఢిల్లీ) ఎగ్జిక్యూటివ్ మెంబరు డా॥ శివానందం ఈ జాతీయ సదస్సు "టెక్నికల్ సావనీర్" ఆవిష్కరించారు. శ్రీ మాగంటి  సుబ్రహ్మణ్యం, శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ అధ్యక్షులు అడ్వాన్స్‌డ్ శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు.

ఐ-సర్వ్ అధ్యక్షులు, ప్రారంభసభకు అధ్యక్షులు ప్రొ॥ కుప్పా వేంకట కృష్ణమూర్తిగారు స్వాగతోపన్యాసం చేశారు. ఆయుర్వేద రంగంలో జరుగుతున్న పరిశోధనల గురించిన వివరాలను, వాటి ఫలితాలను ప్రచారం చేయటానికి గానీ, విస్తరించటానికి గానీ తగిన యంత్రాంగం లేనందువల్ల సామాన్యుడికి, సాధారణ ఆయుర్వేద వైద్యుడికీ, ఈ పరిశోధనా ఫలితాలు చేరటం లేదని వివరించారు. ఈ అవరోధాన్ని అధిగమించేందుకు ఒక సమాచార యంత్రాంగాన్ని నిర్మించ వలసిన అవసరం వుందన్నారు. ఈ నాటి నానో టెక్నాలజీని పూర్వకాలపు మన ప్రాచీన నానో టెక్నాలజీతో పోల్చి చూపారు.

తదుపరి ప్లీనరీ సెషన్‌లో ప్రొ॥ కె.వి. కృష్ణమూర్తిగారు వైద్య శాస్త్ర ధర్మశాస్త్రాల గురించి ఉపన్యసించారు.

మూడు రోజుల టెక్నికల్ సెషన్స్‌లో ప్రసిద్ధులైన  ఆయుర్వేద ప్రొఫెసర్లు క్రింద వివరించిన వివిధ అంశాలమీద వ్యాసాలు సమర్పించారు.

డా॥ యం పరాంకుశరావు, తిరుపతి, (ప్రధానమైన ఆయుర్వేద ఔషధాలు, వర్తమాన పరిశోధనలు), డా॥ పి. హిమసాగరచంద్రమూర్తి, (ఆయుర్) (ఔషధ తయారీ విధానంలో సులభ పద్ధతులు), డా॥యస్. వెంకటరావు (వర్తమాన సమాజానికి ఆయుర్వేద వైద్యంతో గల అవసరాలు), డా॥ కొండా వేంకటేశ్వర్లు, (ఒ.పి. లెవెల్ పంచకర్మ పద్ధతులు), డా॥ వైద్య, యం.డి.(ఆయుర్), (బాలరోగ

చికిత్సా విధానాలు), డా॥ వి.యన్. సుబ్బలక్ష్మి (గైనకాలజీ, ఆయుర్వేద చికిత్సా విధానాలు), వ్యాసాలు సమర్పించారు. మెసర్స్ అగ్రిగోల్డ్ విజయవాడ వారు సుమారు 180 మూలికలను వివరించే "స్లైడ్‌షో" ప్రదర్శించారు.

సుమారు 120 మంది ఆయుర్వేద వైద్యులు రాష్ట్రం నుండే కాక ఇతర రాష్ట్రాల నుండి కూడా వచ్చి పాల్గొన్నారు. ఆయుర్వేద అభిమానులు యల్.సి.డి. ప్రొజెక్షన్ సహాయంతో సాగిన సదస్సులోని వివిధ ఉపన్యాసాలను శ్రద్ధగా విన్నారు. ప్రశ్నోత్తర సమయంలో వైద్యులు తమ తమ సందేహములు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రొ॥ కె.వి. కృష్ణమూర్తి అధ్యక్షత వహించిన ముగింపు సభలో మెసర్స్ అగ్రిగోల్డ్ వైస్ ప్రెసిడెంట్ శ్రీసాయిరామ్ ప్రసంగించారు. డా॥ యమ్. పరాంకుశరావు రచించిన "ద్రవ్యగుణక్రియా యోగములు" అనే గ్రంథాన్ని శ్రీమాగంటి సుబ్రహ్మణ్యం గారు ఆవిష్కరించారు. డా॥ భానుప్రకాష్, సంపాదకుడు, యస్.యఫ్.పి.ఎ.ఎ డైరీ, నెల్లూరు వందనసమర్పణతో సదస్సు, శిక్షణాశిబిరం 18.3.08 సాయంత్రం ముగిసింది.

జయగురుదత్త

## విద్యార్థి జ్ఞానబోధసభ విద్యార్థులకు గమనిక

ప్రతి సంవత్సరము పూజ్య శ్రీ స్వామీజీవారి జన్మదినోత్సవ వేడుకలలో విద్యార్థి జ్ఞానబోధ తరగతులు నిర్వహింపబడుతున్నాయి.

కానీ ఈ సంవత్సరం ఈ వేడుకలలో కార్యక్రమాల విస్తృతి బాగా పెరగటంచేత, దాన్ని రద్దు చేయలేక, విద్యార్థుల మీద ప్రేమతో పూజ్య స్వామీజీవారు ఈ కార్యక్రమ నిర్వహణలో మార్పు చేయటం జరిగింది.

వచ్చే డిసెంబరు మాసంలో, హైదరాబాద్ ఆశ్రమంలో జరిగే క్రిష్టమస్ పండుగ సందర్భంలో ఈ తరగతులు జరుపవలెనని ఆదేశించారు. కనుక విద్యార్థులు, ఆయా ఆశ్రమ నిర్వాహకులు ఈ మార్పును గమనించి అందరు విద్యార్థులకు, తల్లిదండ్రులకూ తెలుపగలరని వినతి.

–కార్యవర్గము
**దత్తపీఠము**

## చిటికె సాహితీ నందనవనంలో వెల్లివిరిసిన ఓ కవితా స్ఫూర్తి

శ్రీ స్వామీజీవారి కళ్ళల్లో ఒకలాంటి తళుక్కుమనే మెరుపును నేను ఎప్పుడూ గమనిస్తుండేదాన్ని. కొలనులోని నీటిలో ఉదయారుణకాంతులు ప్రతిఫలిస్తే వచ్చే కాంతిపుంజమది. ఏ మహాత్ముల కళ్ళల్లోను అటువంటి తేజస్సును చూడలేదు. శ్రీ స్వామివారి యోగసాధన సారూప్య తేజమదేమో అనుకునేదాన్ని. ఎప్పుడు ఆ కళ్ళల్లో మెరిసే కాంతిని పట్టుకోవాలని ఆరాటపడేదాన్ని. ఇందులో నిగూఢ తత్త్వముంది. స్వాతిచినుకు పడి మెరిసే ముత్యపుచిప్పలాంటి ఆ కళ్ళు గుప్పిస్తున్న తేజస్సును వర్ణించడానికి నా దగ్గర భాష లేదు. పరిపరివిధాల ప్రయత్నించినా పరిష్కారం దొరకలేదు.

ముఖ్యంగా శ్రీ స్వామీజీవారు దివ్యనాద చికిత్స చేస్తూ జనం మధ్యలోకి వచ్చినప్పుడు తళుక్కు తళుక్కుమని మెరిసే ఆ నయనారవిందాలు చూసేకన్నులకు ఎంతో విందుచేసేవి. ప్రత్యక్ష దర్శనంలో కాకుండా టి.వి.లో వచ్చే లైవ్ ప్రసారాల్లో కూడా నాకీదర్శనం లభించేది. ఎన్నిమార్లో శ్రీ స్వామీజీవారి ఆశ్రమంలో క్వొశ్చన్అవర్ పెట్టి ఏదైనా అడగండని సూచించినపుడు కూడా ఎన్నోమార్లు ఈ విషయం ముందుకుపడి అడగాలని వున్నా అడగలేకపోయేదాన్ని.

ఈ సందిగ్ధావస్థలో కొన్ని రోజులు గడచిపోయాయి. ఒకానొక శుభముహూర్తాన శ్రీ స్వామీజీవారి దివ్యహస్తాల మీదుగా చిటికె సాహిత్యం పుస్తకం ఆవిష్కరణ జరిగింది. ఆ సందర్భంగా స్వామీజీవారు మాట్లాడుతూ, "మానవత్వమనే బిడ్డ జారిపోకూడదనే ఆక్రోశంతో వ్రాసిన వ్యక్తిత్వపు విలువల గుళికలివి! జనావళికి నిత్యజీవితంలో ఉపయోగపడే సచ్చిదానంద గీతికలివి" అంటూ చేసిన ఉపదేశవాక్యాలు నన్నెంతో కదిలించాయి. నేటి సామాజిక వ్యవస్థలోని సహజీవన సప్తపది కర్థాలు నెమరువేయిస్తూ, హాస్యాలు చేస్తూ, ఆశలే పూయిస్తూ, మానవతా విలువలకు అద్దంపట్టి వ్రాసిన ఆ నవ్యకవితలను ఇష్టంగా ప్రతిరోజు చదువుతుండేదాన్ని. ఖాళీ సమయాల్లో చదివి నెమరువేసుకునేదాన్ని.

అదేవిధంగా ఒకరోజు చిటికె సాహిత్యం చదువుదామని లోపలి పేజీ తిప్పగా శ్రీ స్వామీజీవారి ఫోటో పేజి వచ్చింది. అలా ఆ ఫోటో ఎప్పుడు వచ్చినా

దండం పెట్టుకుని పక్కపేజీలోకి వెళ్ళిపోయేదాన్ని. కాని ఈ రోజిలా చేయకుండా అదేపనిగా స్వామీజీవారి ఫొటోనే చూస్తూ కూర్చున్నా. మళ్ళీ అవే కళ్ళు దర్శనమిచ్చాయి. ప్రత్యక్షదర్శనంలో లాగానే ఆ కళ్ళు నవ్వుతూ ప్రతిఫలిస్తున్నాయి. చూపులు మరల్చుకోలేకపోయాను. వర్ణించనలవికాని భాష నన్ను వేధిస్తోంది. ఈ అంతరార్థం ఏమిటో నాకు వివరింపవా దత్తా అంటూ పదేపదే ప్రశ్నించాను, ఆ కళ్ళల్లోకి కళ్ళుపెట్టి చూస్తూ....

ఏ కళనున్నాడో నా స్వామి... వెంటనే, ' దాని పేరే దయ' అంటూ ఓ భావతరంగం పిల్లగాలిలా మెల్లిగా తాకింది. ఆ... అంటూ ఆశ్చర్యపోయాను. ఎగిరిగంతేశాను. ఇదే... ఇదే సరియైన సమాధానం దొరికిందంటూ మనసు ఆనందంతో నాట్యం చేసింది. అసలు రహస్య మిదన్నమాట! 'దయాసముద్రుడు' అని కవులు వర్ణించు సార్థకనామధేయమిదియన్నమాట. ఎన్ని కోట్ల కరుణకిరణాలతో ఆ దయాసాగరంలో పొదిగి శోభిల్లుతూ నలుదిక్కులా అరుణకాంతుల్ని విరజిల్లుతున్నాయన్నమాట. ఓహ్... ఎంత దివ్యమైన అనుభూతి ఇది. నా అన్వేషణ ఫలించింది.

ఈ నేపథ్యంలో ఓమారు నవరాత్రుల్లో శ్రీ స్వామీజీవారు చేసిన అనుగ్రహభాషణం గుర్తుకువచ్చింది. రాక్షస సంహారం కోసం దేవతలందరూ ఆయుధాలతో విజృంభిస్తే అమ్మ మాత్రం కరుణతో విజృంభిస్తుందన్నారు. ఇది అక్షరసత్యం. స్వామీజీవారు దివ్యనాద చికిత్సా సమయంలో జనం మధ్యకు వెళ్ళినప్పుడు వారి కళ్ళలో ప్రతిఫలించే కరుణ మరీ విజృంభించడం పలుమార్లు చూశాను. అపుడు...

**అదిగదిగో గురుదేవుల తెరచాప కదలివస్తుంది**
**దయాసముద్రమనే అలల మీద తేలి తేలి**
**మిక్కుమిక్కుమంటూ చూసే దరితెలియని నిస్పృహోయి.. కనవోయి అటుచేసి**
**నీ వైపె వచ్చెనది – దత్తుడే నావికుడై తెచ్చెనది.**
**భయం లేదు నీకింక సుడిగుండమె రాదింక**
**గురుపాదం పట్టి నీవు దత్తతీరం చేరుకో –సచిదనంద పడవలో హాయిగా తేలిపో...**

అంటూ ఓ భావం మెదలి ఎలుగెత్తి పాడాలనిపించింది. ఆ దయార్ద్ర హృదయానికి మనసుప్పొంగి నా కళ్ళలో నీళ్ళు జలజలా రాలిపడ్డాయి. రాలిపడుతున్న ఆ బిందువుల్లోంచి ముత్యాల్లాంటి అక్షరాల కూర్పు స్వామికి హారంగా పొదిగిందిలా...

**దయ అనే తేమతో నిండివున్నవి స్వామి, మీ కరుణా కటాక్ష వీక్షణాలు**

**కష్టమనే కన్నీటిపొరలతో కమ్ముకున్నాయి స్వామి, మా కన్నుల చివరలు...**

**ఇచ్చేందుకో స్వామి ఏమున్నది – ఈ పేద మనసులో మిగులున్నది**

సచ్చిదనంద ధ్యానమనే నిధి వున్నది.

**వెతలలోనే కాలమంతా గడిపి నేను వేసారితిని**

**ప్రణవనాదము పూరింపుము – నీ పదములంటివాలి విశ్రమింతును**

అని.. నిట్టూరుస్తూ ఓదార్పును కోరగా చిటికె సాహితీ నందనవనంలో ఓ సరికొత్త కవితాసుమం వెల్లివిరిసేలాగా... అభయహస్త మొకటి చాచి అరుణలతను నిమిరింది– శాంతికిరణమెదనుజేరి సచ్చిదనంద మిచ్చింది.

– సదా సద్గురు చరణ సేవలో

**అరుణాదేవి**

శ్రీమతి&శ్రీ ఏలేశ్వరపు సత్యనారాయణ మూర్తి గార్ల ఏకైక పుత్రుడు
**చి॥ శ్రీ వేణుమాధవ శాస్త్రి**
శ్రీమతి&శ్రీ గరిమెళ్ళ కనకదుర్గా ప్రసాద్ గార్ల కనిష్ఠ పుత్రిక
**చి॥ల॥సౌ॥ లక్ష్మి ల**
వివాహం 30.3.2008 ఆదివారం విజయవాడలో జరిగింది.
**ఈ నూతన దంపతులపై శ్రీగురుదేవుల కృపాశీస్సులు వర్షించు గాక!**

శ్రీమతి&శ్రీ వర్షుల కేశవ శివరామకృష్ణ గార్ల జ్యేష్ఠ పుత్రుడు
**చి॥ వి.కె.ఎమ్. శివప్రసాద్**
శ్రీమతి&శ్రీ పి. శ్రీనివాసరావు గార్ల కనిష్ఠ పుత్రిక
**చి॥ల॥సౌ॥ చౌడేశ్వరి ల**
వివాహం 16.3.2008 ఆదివారం ప్రొద్దుటూరులో జరిగింది.
**ఈ నూతన దంపతులపై శ్రీగురుదేవుల కృపాశీస్సులు వర్షించు గాక!**

మా అల్లుడు చి॥ ఆర్. హరీష్ కుమార్ రెడ్డి, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

2008 ఏప్రియల్‌లో

**విదేశయానము (U.K) చేయుచున్న శుభ సందర్భమున**



**శ్రీశ్రీశ్రీ పరమపూజ్య గణపతి సచ్చిదానంద స్వామీజీ**

మరియు

**పరమపూజ్య శ్రీశ్రీ దత్తవిజయానందతీర్థస్వామీజీవార్ల**

**దివ్య ఆశీస్సులు ప్రార్థిస్తూ ...**

అనంతపూర్ భక్తులు

వై. రామకృష్ణారెడ్డి (Lect. Rtd.)

శ్రీమతి వై. ప్రమీల

&

శ్రీమతి వై. హరిప్రియ Software Engr. (భార్య)

కు॥ వై. కృష్ణప్రియ, B.Tech

## లిఖిత పరీక్ష

మైసూరు దత్తపీఠంలో ది. 27.05.2008 మధ్యాహ్నం 2 గంటలకు 5 నుండి 10వ తరగతిలోపు పిల్లలకు లిఖిత పోటీ పరీక్ష నిర్వహించబడును.

1. విషయం : కథాసాగరం–భాగం1, రామాయణ మహాభారతాలు, శ్రీ దత్త దర్శనము, దత్తపీఠం మరియు శ్రీస్వామీజీ గురించి
2. భాష : కన్నడ, ఇంగ్లీష్, తెలుగు (కనీసం 10మంది అభ్యర్థులువున్నచో తమిళం, హిందీ భాషలలో కూడా నిర్వహించబడును)
3. పరీక్షావిధానం: 50 మార్కులు కథాసాగరం నుండి, మిగిలిన 50 మార్కులు ఇతర అంశములపై (ఏకవాక్య లేక సంక్షిప్త సమాధాన ప్రశ్నలు)

ఈ పరీక్షలో పాల్గొనదలచిన వారు తమ పూర్తిపేరు, చిరునామ, ఫోన్ నంబరు, చదువుతున్న తరగతి మరియు పరీక్ష వ్రాయదలచుకున్న భాష – ఈ వివరములను ఒక తెల్లకాగితం పై వ్రాసి 22.05.08 లోగా "గాయత్రి, మానస కుటీర, శ్రీ గణపతి సచ్చిదానంద ఆశ్రమ్, మైసూరు –570025" అనే చిరునామాకు పంపవలెను.

(16సంవత్సరముల పైబడినవారికి 28.05.08న తెలుగు, కన్నడ, తమిళ్, ఇంగ్లీషు భాషలలో వ్యాసపరీక్ష నిర్వహించబడును. పరీక్షా విషయము 25వ తేదీన ప్రకటించబడును)

## హస్తకళా ప్రదర్శన

శ్రీ స్వామీజీవారి జన్మదినోత్సవ సందర్భముగా మైసూరు దత్తపీఠంలో ది. 24.05.08 నుండి 30.05.08 వరకు అఖిల భారత హస్తకళా ప్రదర్శన మరియు అమ్మకములు జరుగును.

దత్తపీఠ వివిధ శాఖల జయలక్ష్మి మాత మాతృమండలి సభ్యులచే ఏర్పాటు చేయబడే ఈ ప్రదర్శనకు అందరూ ఆహ్వానితులే.



# మైసూరు ఆశ్రమంలో మహాశివరాత్రి



ది. 4.3.2008 న ఉదయం 10 గంటలకు, సుప్రసిద్ధ కవి శ్రీ బి.ఎస్.ఎస్ కౌశిక్‌గారిచే కన్నడ భాషలో రచింపబడి, కర్నాటకలోని ప్రసిద్ధ గమక విద్వాంసులచే గానం చేయబడిన "శ్రీగురుదత్త దర్శనాదర్శ" అనే MP3 ఆడియో బుక్ పూజ్య స్వామీజీవారిచే విడుదల చేయబడినది.

ఉదయం 11 గంటలకు నాదమంటపములో గిరిజా కల్యాణము నిర్వహించబడినది. సాయంకాలం 5 గంటలకు శివుడికి రుద్రాక్ష రథోత్సవం నిర్వహించబడినది. అనంతరం 6 గంటలకు నాదమంటపములో, శ్రీ వేంకటమఖి, త్యాగరాజస్వామి ఆరాధనోత్సవ సందర్భముగా మైసూరు నగర సంగీత విద్వాంసులచే పంచరత్న కృతుల సామూహిక గాన కార్యక్రమము జరుపబడినది.

ది. 5.3.08 మహాశివరాత్రి పర్వ సందర్భముగా ఉదయం శ్రీచక్రపూజ, నాదమంటపం ఎదురుగా ప్రతిష్ఠించిన నందీశ్వరునికి విశేష పూజ, రుద్రహోమము నిర్వహించబడినవి.

సాయంకాలం 5 గంటలకు గంగోత్సవము – మానస సరోవర, కావేరీ, యితర పవిత్ర నదీజలములను ఊరేగింపుగా సచ్చిదానందేశ్వర శివాలయమునకు తీసుకొనిపోవుట – నిర్వహించబడినది. 6 గంటలకు వేదపండితులు యజుర్వేదమునందలి రుద్రప్రశ్న ఏకాదశ పారాయణ చేస్తూండగా, పూజ్య స్వామీజీవారు పంచామృతాలతో, వివిధరకాలైన మంగళ జలాలతో సచ్చిదానందేశ్వరుడికి అత్యంత వైభవంగా అభిషేకాదులు నిర్వహించారు. అనంతరం రాత్రి 11గంటల వరకు భక్తులచే అభిషేకం, తెల్లవారుఝాము వరకు విశేష అర్చనలు, అలంకారాలు నిర్వహించబడినాయి.

రాత్రి 7 గంటల నుండి 12 గంటల వరకు శ్రీ శివశంకరస్వామి మరియు బృందము వారిచే లయలహరి సంగీత కార్యక్రమము, శ్రీ అర్జున్ బృందము వారిచే కర్నాటక శాస్త్రీయ సంగీత సేవ నిర్వహించబడినవి.

12 గంటలకు పూజ్య శ్రీ స్వామీజీ సచ్చిదానందేశ్వరునికి అభిషేకం చేసి, 2 గంటల నుండి శివ భజనలతో దివ్యనామ సంకీర్తన, ధ్యాన చికిత్సా

సంగీతము, అనుగ్రహ భాషణము చేశారు. ఈ శివరాత్రి భజనలయందు విశేషముగా, శ్రీ స్వామీజీవారు గానం చేసిన ప్రతి భజనయందలి విశేష నిగూఢార్థములను బాలస్వామివారు భక్తులకు విపులముగా వివరించారు. ఉదయం 6గంటలకు శ్రీ సచ్చిదానందేశ్వరునికి మహామంగళ హారతి, అష్టావధాన సేవ, తీర్థప్రసాద వితరణలతో శివరాత్రి పర్వ వేడుకలు వైభవముగా ముగిసినవి.

## స్వర్ణ సింహాసనాధిరోహణ

సద్గురుదేవులు శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీవారి శ్రీ చరణములు అధిరోహించుటకై నూతనముగా నిర్మించిన స్వర్ణసింహాసన చరప్రతిష్ఠకై మండల దీక్షా విధానముగా వివిధ దేవతా మంత్రజపం, పారాయణ, హోమ తర్పణలు యథాశక్తిగా నిర్వహించిన అనంతరం, సద్గురుదేవులు, ఫాల్గుణ శుద్ధ తృతీయ రేవతీ నక్షత్రయుక్త మేషలగ్న పుష్కరాంశయందు, ది. 10.03.2008 సోమవారం ఉదయం గం9-45లకు స్వర్ణసింహాసనాధిరోహణ గావించి, భక్తులను విశేషముగా అనుగ్రహించారు. ఈ శుభసందర్భంలో శ్రీ గురుదేవులకు శ్రీ బాలస్వామివారు ప్రత్యక్ష పాదపూజ చేశారు. తదనంతరం భక్తులందరు గురుపాదుకా స్పర్శ, సమర్పణ కార్యక్రమంలో పాల్గొని గురుదేవుల అనుగ్రహానికి పాత్రులయ్యారు.

1. వేదనిధి, అన్నదానము, శ్రీ దత్తవేంకటేశ్వర స్వామి నిత్యపూజ, ఇతర శాశ్వత సేవలలో పాల్గొన్న సభ్యులు మీ చిరునామా మారితే వెంటనే తెలియపరచ గలరు.సేవాకర్తలకు పంపుతున్న అనేక ప్రసాదములు, వార్షిక నివేదికలు సరియైన చిరునామా లేనందువల్ల తిరిగి వస్తున్నాయి. కాబట్టి మారిన చిరునామా కార్యాలయానికి తెలియబరచండి. ఇమెయిల్:sgsvedanidhi@gmail.com
2. దత్తపీఠ పాఠశాలలో యజుర్వేద, స్మార్త, అర్చక శిక్షణా తరగతులు జూన్ నెలలో ప్రారంభమవుతాయి. ఆసక్తిగల వటువులు (సాంప్రదాయికంగా ఉపనయనం చేసుకుని 12సంవత్సరాల వయస్సు దాటనివారు) వేదవిభాగాన్ని(9448044360) మే 10వ తారీకులోగా పూర్తి వివరాలతో సంప్రదించండి.
3. ప్రతి నెలా కనీసం 30 రూపాయలు చెల్లించి శ్రీ స్వామీజీ వారికి ప్రీతిపాత్రమైన ఆశ్రమ నిత్యపోషణ పథకంలో సభ్యులుగా చేరండి.

దత్తపీఠాధిపతి జగద్గురు పరమపూజ్య శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీవారు
స్వర్ణ సింహాసనాధిరోహణం చేసిన శుభసందర్భంలో
భక్తితో సమర్పించుకొన్న సాహిత్య పుష్పార్చన

పల్లవి: ఆనంద మానంద మానందమాయె
సద్గురు శ్రీసచ్చిదానందు కనగా

తొలివెలుగు విరజిమ్మ సూర్యబింబమ్మవుచు
వెలుగొందు బంగారు సింహాసనమున
కనువిందు కావించు కారుణ్యమూర్తియౌ
శ్రీ సచ్చిదానంద గురుదేవు గనరండి ॥ఆనంద॥

నలుమోముల నుండి నాల్గువేదాలు
దివ్యవాగ్వైభవము దశదిశలు నింపగా
సంగీత సాహిత్య నవరసాలను నింపు
నలువగా కొల్వున్న గురుదేవు కనరండి ॥ఆనంద॥

శ్రీవైభవమ్ముతో ఆనంద ధామమౌ
ముక్తిసౌధమ్ములో బంగారు పీఠాన
వైష్ణవప్రభలతో సిరిదొరగ వరలెడు
శ్రీ సచ్చిదానంద గురుదేవు గనరండి ॥ఆనంద॥

మంచుమల కొనమేడ పసిడి పీఠమ్మున
చిన్ని చుక్కలరేని సిగపైన కైసేసి
శక్తి సగమేనైన జ్ఞానమొసగే శివుని
శ్రీ సచ్చిదానంద గురుదేవు గనరండి ॥ఆనంద॥

ముగురుమూర్తులు గూడి యేకరూపము కాగ
మూర్తిత్రయరూప మత్యద్భుతంబుగా
దత్తుడే శ్రీసచ్చిదానంద స్వామిగా
రాజిల్లుచున్నాడు రండి చూడండి ॥ఆనంద॥

-శ్రీ కూచిభట్ల చంద్రశేఖర శర్మ

## శ్రీ స్వామీజీవారి పర్యటనా విశేషాలు

**సింగపూర్:**

నాలుగు వారముల ఆంధ్రప్రదేశ్ పర్యటన అనంతరం శ్రీ స్వామీజీ వారు సింగపూర్ పర్యటనకు వెళ్ళినారు. అచ్చట సెరంగూ వీథిలోని శ్రీనివాస్ పెరుమాళ్ దేవాలయంలో మలేషియా భక్తులు సద్గురుదేవుల దర్శనము చేసుకొన్నారు.

**సప్తస్వర రాగసాగర – ఢిల్లీ:**

ది. 3.2.2008 సాయంకాలం 'సప్తస్వర రాగసాగర' దివ్యనాద సంగీత చికిత్సా విభావరి స్థానిక సిరిఫోర్ట్ ఆడిటోరియం నందు నిర్వహించబడినది.

ఇచ్చటనే ఉదయం రాగరాగిణీ విద్య గురించి, సంగీత చికిత్సయందు శ్రీ స్వామీజీ వారి విశిష్ఠ పద్ధతుల గురించి కంప్యూటర్ ప్రొజెక్షన్ ప్రోగ్రామ్ ద్వారా ఆహూతులకు వివరించబడినది.

నాదబ్రహ్మ వీడియో ప్రదర్శన అనంతరము కేంద్ర హోంశాఖ మంత్రివర్యులు శ్రీ శివరాజ్‌పాటిల్ గారు, న్యూఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ శ్రీ తేజేందర్ ఖన్నా, కేంద్ర మంత్రివర్యులు శ్రీ టి. సుబ్బరామిరెడ్డి గార్లు జ్యోతిప్రజ్వలన గావించి సంగీత విభావరిని లాంఛనముగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ స్వామీజీవారు రచించి గానం చేసిన హిందీ భజనల సి.డి. 'నామార్చన' విడుదల చేయబడినది.

లలిత, నటభైరవి, హంసానంది, హిందోళ, సరసాంగి, శ్రీరంజని మరియు ధర్మవతి రాగాలతో కూడిన యీ సప్తస్వర రాగసాగరమున ఢిల్లీ నగర ప్రముఖు లనేక మందితో పాటు వేయిమందికి పైగా శ్రోతలు ఓలలాడి తరించారు.

**సూరత్ (5, 6 ఫిబ్రవరి 08):**

ఢిల్లీ నుంచి బయలుదేరి శ్రీ స్వామీజీ సూరత్ నగరమునకు చేరుకున్నారు. ఈ లీలావిశ్వంభర క్షేత్ర ప్రార్థనా మందిరంలో ఫిబ్రవరి 5, 6 తేదీలలో శ్రీ

స్వామీజీ ఈ క్షేత్రచరిత్రను, లీలావిశ్వంభర దత్తస్వామి అవతార విశేషాలను భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా శ్రీ స్వామీజీ గుజరాతీ భాషలో ప్రప్రథమంగా గానం చేసిన భజన సిడి 'నామార్చన' విడుదల చేయబడినది. ఈ సిడి లోని 'గురుజినా నామానిహ' అనే భజన భక్తులను విశేషంగా ఆకట్టుకొన్నది.

**బరోడా (7 ఫిబ్రవరి 08):**

సూరత్ నుండి అహ్మదాబాద్‌కు బయలుదేరిన స్వామీజీ మార్గమధ్యంలో బరోడా ఆశ్రమాన్ని సందర్శించి, యిచ్చట నూతనముగా నిర్మించిన గురునిలయ ఉద్ఘాటన గావించారు. ప్రఖ్యాత జానపద గీత గాయకులు శ్రీ దత్తుభాయి పాఠక్, బృందము భక్తి గీతములను ఆలపిస్తూ స్వాగత వచనములు పలుకగా, శ్రీమతి రమాదేవి, ప్రొ॥ రావుగార్లు స్వామీజీవారికి మాలార్పణ చేసి స్వాగతం చెప్పారు. దత్తావతారులు శ్రీ రంగ్ అవధూత మహరాజ్ రచించిన భజనల పుస్తకాన్ని శ్రీ దత్తూభాయ్ పాఠక్ స్వామీజీకి సమర్పించారు. అనంతరం స్వామీజీ అనుగ్రహ భాషణం చేస్తూ, భక్తులు తమ నిత్యజీవన విధానంలో ఆధ్యాత్మికతను మేళవించి జీవనం సాగించాలని ఉద్బోధించారు. స్థానిక విద్యార్థులు శ్రీ స్వామీజీని దర్శించుకొని ప్రత్యేక ఆశీస్సులు పొందారు.

బరోడా నుండి మార్గమధ్యమున కంభట్ అనే చిన్న పట్టణంలోని యిద్దరు భక్తుల వ్యాపార సంస్థలను, గృహాలను సందర్శించి, ఆశీర్వదించి రాత్రికి అహ్మదాబాద్ నగరానికి చేరుకొన్నారు.

**అహ్మదాబాద్ (8 ఫిబ్రవరి 08):**

ది. 8.2.08 ఉదయం స్థానిక ఈశ్వర భవనమందు స్వామీజీ శ్రీచక్రపూజ, గణపతి హోమాదులు నిర్వహించి భక్తులను అనుగ్రహించారు. సాయంకాలం స్థానిక టౌన్‌హాల్ ఆడిటోరియంలో 'సప్తస్వర రాగసాగర' ధ్యాన సంగీత చికిత్సా విభావరి నిర్వహించారు. గుజరాత్ రాష్ట్ర గవర్నర్ శ్రీ నావల్ కిషోర్ శర్మ గారు, హైకోర్టు న్యాయమూర్తి శ్రీ ఎమ్.జె. షా గారు ఈ విభావరిని ప్రారంభించారు. గుజరాతీ భాషలో శ్రీస్వామీజీ ప్రప్రథమంగా గానం చేసిన

భజనల సిడి 'నామార్చన' లాంఛనంగా ఆవిష్కరించబడినది. ఈ సందర్భంగా ప్రసిద్ధ 'దత్త భావని స్తుతి' మరియు 'గురుజినా నామానహ' అనే గుజరాతీ భజనలను శ్రీ స్వామీజీ గానం చేశారు. మరునాడు ది. 9.2.2008న హైదరాబాదుకి ప్రయాణమయ్యారు.

**హైదరాబాదు, విజయవాడ (9, 10 ఫిబ్రవరి 08):**

హైదరాబాదు ఆశ్రమములోని కార్యసిద్ధి ఆంజనేయ స్వామికి అభిషేకము నిర్వహించి స్వామీజీ విజయవాడ చేరుకొన్నారు.

విజయవాడ ఆశ్రమంలో పునర్నిర్మించిన వేదికపై నవగ్రహ పునఃప్రతిష్ఠ గావించారు. అనంతరము, నూతన వసతులతో పునఃనిర్మించిన కళ్యాణమంటపములో మహాగణపతి హోమ పూర్ణాహుతి చేశారు.ఈ కళ్యాణ మంటపమునకు 'ఎస్.జి.ఎస్ వరాహ నరసింహ కళ్యాణ మంటపము' అని, యీ భవన సముదాయమునకు 'గణపతి భవనము' అని నామకరణం చేశారు.

ఈ సందర్భంగా స్వామీజీ తమ ప్రియభక్తులైన స్వర్గీయ వరాహ నరసింహమూర్తి గారి సేవాభక్తులను స్మరిస్తూ, వారి పుత్రులైన శ్రీ వాసుదేవరావు, శ్రీ జోగారావు గార్లను ఆశీర్వదించారు. నూతన వసతులతో నిర్మితమైన ఈ కళ్యాణ మంటపములో భక్తులు వివాహ, ఉపనయనాది శుభకార్యాలను, పూజావ్రతాదులను నిర్వహించుకోవటానికి స్వామీజీ అనుమతి యిచ్చారు. పవిత్ర దేవాలయ ప్రాంగణంలో యిటువంటి కార్యక్రమాల నిర్వహణ అందరికీ శుభప్రదమని ఆశీర్వదించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ది. 5.2.08న విజయవాడలో స్వామీజీ నిర్వహించిన 'యోగచక్రరాగసాగర' ధ్యాన సంగీత చికిత్సా విభావరి ఆడియో సిడిని, ఆదాయపన్ను శాఖ కమిషనర్ శ్రీ ప్రమాణిక్ గారు విడుదల చేశారు.

మరకత రారజాజేశ్వరీ ఆలయ పంచమ వార్షికోత్సవ సందర్భముగా స్వామీజీ రాజరాజేశ్వరీదేవికి క్షీరాభిషేకాన్ని గావించారు. ఈ పవిత్ర దినమున 15మంది బ్రహ్మచారులకు సామూహిక ఉపనయనాలు నిర్వహించబడినాయి.

# భక్తులకు ముఖ్యమైన సూచనలు

1. శ్రీ స్వామీజీవారి 66వ జన్మదిన మహోత్సవాలు మే 25 ఆదివారం నుండి జూన్ 1 వరకు మైసూరులో నిర్వహించబడతాయి. ఈ సమయంలో శ్రీ దత్త వేంకటేశ్వర స్వామివారి 9వ బ్రహ్మోత్సవాలు, నాదమండపం యొక్క 10వ వార్షికోత్సవ కార్యక్రమాలు జరుగుతాయి.
2. దత్తపీఠ వార్షిక వేదపరీక్షలు, వేదసభలు, శ్రౌత యజ్ఞాలు, ప్రవచనాలు, మే 17 నుండి 21 వరకు నిర్వహించబడతాయి.
3. బ్రహ్మోత్సవ సమయంలో ఉదయం శ్రీచక్రార్చన తరువాత 9 గంటలకు ఉత్సవం జరుగుతుంది. అప్పటి నుండి మధ్యాహ్నం వరకు **శ్రీ స్వామీజీ దేవాలయంలో బ్రహ్మోత్సవం విశేషంగా నిర్వహిస్తారు.**
4. శ్రీ స్వామీజీవారి జన్మదినం మే 26 సోమవారం నాడు సద్గురు**దేవులు స్వర్ణ సింహాసనం అధిరోహిస్తారు.** ఈ సందర్భంగా శ్రీ బాలస్వామివారు ప్రత్యక్ష పాదపూజ నిర్వహిస్తారు.
5. రామశంకర కుటీరం పునర్నిర్మాణం అవుతున్నందువల్ల ఆశ్రమంలో వసతి వ్యవస్థ పరిమితంగా వుంటుంది. కనుక **భక్తులు తగిన సొంత ఏర్పాట్లు** చేసుకొనగలరు.
6. అఖిలభారత జ్ఞానబోధసభా సమావేశం మే 31వ తేదీ శనివారం నాడు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతుంది. పాల్గొనే సభ్యులకు బాడ్జీలు క్రితం రోజే ఇవ్వబడుతాయి. **ఈ బాడ్జీ ధరించినవారికే వేదికపై ప్రవేశముంటుంది.** కాబట్టి మే 10 తేదీ లోగా మీ యొక్క వార్షిక నివేదికలు, బాలెన్స్ షీట్ ఆర్థిక నివేదికలు, పాల్గొనే ట్రస్టీల పేర్లను దత్త జ్ఞానబోధసభా ట్రస్ట్ (శ్రీ గణపతి సచ్చిదానంద ఆశ్రమం, మైసూరు–25) కు పంపగలరు.
7. వార్షికంగా జరిగే **సర్వశాంతి కార్యక్రమాలు** మరకత సుబ్రహ్మణ్య స్వామివారి సన్నిధిలో మే 26 సోమవారం సాయంత్రం నుండి నిర్వహించబడతాయి.
8. ఇతర వివరాలకు ఆశ్రమ కార్యాలయాన్ని సంప్రదించండి.

# నక్షత్ర నవగ్రహ మృత్యుంజయ విశ్వశాంతి యజ్ఞం

సద్గురుదేవులు పరమపూజ్య స్వామీజీవారు విశ్వశాంతికై మైసూరు దత్తపీఠంలో నక్షత్ర నవగ్రహ మృత్యుంజయ యజ్ఞాన్ని ప్రారంభించారు.

తొమ్మిది నెలలపాటు జరిగే ఈ యజ్ఞంలో ప్రతిఒక్కరూ పాలుపంచుకోవాలనీ,ఈ క్రింది మంత్రాన్ని (లేక గురువిచ్చిన మంత్రాన్ని) ప్రతినిత్యం వీలైనన్నిసార్లు జపించి, జపసంఖ్యను క్రమం తప్పక మైసూరు ఆశ్రమానికి తెలియచేయాలనీ స్వామీజీ ఆదేశించారు.

**నమ సూర్యాయ చంద్రాయ మంగళాయ బుధాయ చ**
**గురు శుక్ర శనిభ్యశ్చ రాహవే కేతవే నమః**

- మంత్ర జపానికి ప్రత్యేక నియమాలు ఏవీ లేవు.
- మీ జపసంఖ్యను తెలియజేయవలసిన ఫోన్ నంబర్లు

**1. శ్రీగణేశ్ అవధాని – 97315 05172**

**2. శ్రీ రంగారావు – 0821 2486486**

- ఈ యాగానికి నవధాన్యాలు, హోమద్రవ్యాలు, మీ వయస్సు ప్రకారం ఎన్ని ఏళ్ళయితే అన్ని రూపాయలు యాగదక్షిణగా దత్తపీఠంలో సమర్పించ వచ్చును. ఇతర వివరములకు పై నంబర్లలోగాని, ఆశ్రమ ఆఫీసును గాని సంప్రదించగలరు.

–కార్యవర్గము

**అవధూత దత్తపీఠం**

శ్రీమతి నిమ్మగడ్డ శ్యామల& శ్రీ మురళీకృష్ణ గార్ల ఏకైక పుత్రుడు
**చి॥ వేంకట శశాంకదత్త** ఉపనయనం
9.3.2008 ఆదివారం మైసూరు శ్రీదత్త వేంకటేశ్వర క్షేత్రంలో జరిగింది.
**ఈ చిరంజీవిపై శ్రీగురుదేవుల కృపాశీస్సులు వర్షించు గాక!**

---

శ్రీమతి&శ్రీ దొడ్ల మల్లారెడ్డి గార్ల ఏకైక పుత్రిక
**చి॥ల॥సౌ॥ ఝాన్సీ**
శ్రీమతి&శ్రీ గుర్రం యాదగిరి రెడ్డి గార్ల కనిష్ఠ పుత్రుడు
**చి॥** శ్రవణారెడ్డి ల
వివాహం ది.16.02.2008 స్థిరవారం హైదరాబాదులో జరిగింది.
**ఈ నూతన దంపతులపై శ్రీగురుదేవుల కృపాశీస్సులు వర్షించు గాక!**

---

శ్రీమతి&శ్రీ బొబ్బిలి పూర్ణచంద్రారెడ్డి గార్ల జ్యేష్ఠ పుత్రిక
**చి॥ల॥సౌ॥ తపస్వీ**
శ్రీమతి&శ్రీ మామిడి భగిరెడ్డి గార్ల కనిష్ఠ పుత్రుడు
**చి॥ జగన్‌మోహన్** రెడ్డి ల
వివాహం ది.24.02.2008 ఆదివారం సికిందరాబాద్‌లో జరిగింది.
**ఈ నూతన దంపతులపై శ్రీగురుదేవుల కృపాశీస్సులు వర్షించు గాక!**

---

శ్రీమతి&శ్రీ దంతులూరి ధర్మరాజు గారి పుత్రిక
**చి॥ల॥సౌ॥ భగవతి (శ్రీవల్లి)**
శ్రీ వత్సవాయి వెంకట సత్యనారాయణరాజు గారి జ్యేష్ఠ పుత్రుడు
**చి॥ రవివర్మ** ల
వివాహం ది.22.02.2008 శుక్రవారం రాత్రి భీమవరంలో జరిగింది.
**ఈ నూతన దంపతులపై శ్రీగురుదేవుల కృపాశీస్సులు వర్షించు గాక!**

---

శ్రీమతి&శ్రీ తొమ్మండ్ర దేవేంద్రశెట్టిగార్ల కనిష్ఠ పుత్రుడు
**చి॥ ప్రశాంత్**
శ్రీమతి&శ్రీ చిందనూరు సుబ్రహ్మణ్యం గార్ల ద్వితీయ పుత్రిక
**చి॥ల॥సౌ॥ గీతావాణి** ల
వివాహం 13.03.2008 శుక్రవారం అనంతపురంలో జరిగింది.
**ఈ నూతన దంపతులపై శ్రీగురుదేవుల కృపాశీస్సులు వర్షించు గాక!**

# వ్యాస రచనా పోటీ 2008 ...

**వ్యాసమునకు విషయములు:**

1. సిద్ధ నాగార్జునుడి యొక్క రసతంత్రము
2. ప్రాచీన భారతీయులు లోహ విజ్ఞానశాస్త్రమున సాధించిన విజయాలు
3. శుల్బ సూత్ర గణిత శాస్త్రము
4. వరాహమిహిరుడిచే రచింపబడిన బృహత్ సంహిత అనే గ్రంథమందు భవిష్యత్ ఉపద్రవాలను ముందుగా సూచించుట
5. మహాభారతములోని ఖగోళశాస్త్ర సంబంధిత విషయాలు
6. భారద్వాజ మహర్షి రచించిన వైమానిక శాస్త్రము
7. పురాణములలోని నదుల యొక్క భౌగోళిక వివరములు

**నియమాలు:**

1. వ్యాసమున రచించిన వివరములు సరియైన ఆధారం కలిగి వుండవలెను.
2. పురాణ, ఇతిహాస గ్రంథములను గాని, ఇతర వైజ్ఞానిక పత్రికలనుంచి గాని ఉదాహరణలు సేకరించినట్లైతే వాటి సంబంధిత ఖచ్చితమైన ఆధారములను తప్పక తెలియజేయవలెను. న్యాయనిర్ణేతలు తత్సంబంధిత ఆధారములను చూపమన్న ఎడల వాటి కాపీలు న్యాయ నిర్ణేతల ముందు ఉంచవలెను.
3. పాల్గొనువారు ఏరంగమువారైనను ఫరవాలేదు, వయోపరిమితి లేదు.
4. మీ రచన తెలుగు, సంస్కృతము, ఇంగ్లీష్, కన్నడ, తమిళము లేక హిందీ భాషలలో ఏదైనా ఒక భాషయందు వ్రాయవచ్చును.
5. నూతన రూపాన్ని ఇచ్చునటువంటి లేక నూతన వికాసాన్ని కల్గించునటువంటి మరియు ఆచరణ యోగ్యమైన నూతన అభిప్రాయములకు సుస్వాగతం.
6. ప్రవేశ రుసుము లేదు.
7. అసంబంధమైన, నిరాధారమైన వ్యాసములు స్వీకరించబడవు.
8. మీ వ్యాసములు ఆరు పుటలకు మించకుండ వ్రాయవలెను.
9. మీ వ్యాసం 20.5.08 లోపు "శ్రీ కుప్పా వేంకట కృష్ణమూర్తి గారు, విద్యాధికారి, శ్రీ అవధూత దత్తపీఠం, శ్రీ గణపతి సచ్చిదానంద ఆశ్రమం, దత్తనగర్, మైసూరు –570025" చిరునామాకు పంపవలెను. కవరుపైన

ESSAY COMPETITION-2008అని వ్రాయవలెను.

10. అభ్యర్థి పూర్తి పేరు, వయస్సు, వృత్తి, చిరునామ, టెలిఫోన్ నంబరు, స్పష్టంగా వేరొక కాగితంపై వ్రాసి ప్రతితో జతగా పంపవలెను.

11. ఉపయోగకరమైన సమాచారాన్ని అందించిన ఉత్తమ వ్యాసానికి తగిన నగదు బహుమతి ఇవ్వబడును.

12. పోటీదారులు 7 వ్యాస విషయములలో ఏదైనా ఒక్కటి లేక కొన్ని లేక అన్నిటియందుగానీ వ్యాసములు వ్రాయవచ్చును.


కైలాస మానస సరోవర యాత్ర

శ్రీ స్వామీజీ వారి ఆశీస్సులతో

**కైలాస మానస సరోవర యాత్రకై వెళ్ళదలచిన భక్తులు సంప్రదించండి**

ఇకోట్రెక్ నేపాల్, కాఠ్మండు ఇమెయిల్:info@ecotrek.com.np

సుమారు మే, జూన్, జులై, ఆగస్ట్. సుమారు ఖర్చు 60,000 రూపాయలు.

**అనుభవజ్ఞులైన గైడ్ నిర్వహణలో నేపాల్‌లోనే అతి పెద్దదైన మా యాత్రా సంస్థ ద్వారా మీ జీవితాశయాన్ని నెరవేర్చుకోండి.**

00977-95510 26595 (బిమల్), 00977-98510 41622 (ప్రేమ్)

ఇండియాలో ఇమెయిల్:Sdventures@gmail.com

శ్రీ స్వామీజీవారి ఆశీస్సులు అర్థిస్తూ...

చండూరి అశోక్‌రావు

**శ్రీ లలితా ఐరన్, హార్డ్‌వేర్, పెయింట్స్& జనరల్ స్టోర్స్**

మెయిన్ బజార్, ఘంటసాల


**శ్రీమతి లక్ష్మీసామ్రాజ్యం, శ్రీ పల్లనాగుల గంగాధరరావు గార్లు**

**తమ మొదటి వివాహ వార్షికోత్సవం**

30.3.2008 ఆదివారం గుంటూరులో జరుపుకున్నారు.

**వీరిపై శ్రీగురుదేవుల కృపాశీస్సులు వర్షించు గాక!**

**శ్రీమతి&శ్రీ ఎస్.వి.ఎస్. శాస్త్రిగార్లు**

నూతన నిర్మిత 'దత్తమారుతి నిలయం'లో

గృహప్రవేశం జరుపుకున్నారు.

**వీరిపై శ్రీగురుదేవుల కృపాశీస్సులు వర్షించు గాక!**

## శ్రీస్వామీజీవారి పర్యటనా పట్టిక

| | |
|---|---|
| 09 మే 2008 | జయలక్ష్మీమాత ఆరాధనోత్సవము |
| 19-21 మే 2008 | అఖిల భారత వేద పరీక్షలు, మైసూరు దత్తపీఠంలో |
| 25మే-1జూన్ 2008 | శ్రీస్వామీజీవారి 66వ జన్మదినోత్సవ వేడుకలు నాదమంటప దశమ వార్షికోత్సవము |
| 25మే-1జూన్ 2008 | శ్రీ దత్తవేంకటేశ్వర స్వామివారి 9వ బ్రహ్మోత్సవములు |
| 26 మే 2008 | సద్గురు దేవులకు ప్రత్యక్ష పాదపూజ |
| 14 జూన్ 2008 | - లండన్ నగరములో సద్గురుదేవుల జన్మదినోత్సవము (చాంద్రమాన ప్రకారం) |
| సా॥ 6.30 | - ప్రతిష్ఠాత్మక వెస్ట్ మినిస్టర్ హాల్‌లో నాద చికిత్సా కచేరి |
| 17-20 జూలై 08 | అమెరికా న్యూజెర్సీలో గురుపూర్ణిమ మహోత్సవాలు |
| 30సెప్టెంబర్-9అక్టోబర్08 | నవరాత్రి మహోత్సవములు-మైసూరు ఆశ్రమంలో |

శ్రీస్వామీజీవారి కార్యక్రమములలో అనుకోకుండా మార్పులు జరుగవచ్చు. వివరాలకు ఆశ్రమ కార్యాలయమును సంప్రదించ మనవి. మైసూరు : 0821-2486486, 2480424

✿ ✿ ✿

### ఫోటోల వివరాలు (రెండవ పేజీ తరువాయి)

3. శుద్ధప్రేమమూర్తి చెంత ఏ 'కంగారు'లుండవు. ప్రేమమూర్తి నుంచి ప్రేమ ప్రసాదం అందుకుంటున్న చిరు 'కంగారు' - కెయిర్న్స్ జూ, కెయిర్న్స్, ఆస్ట్రేలియా

4. మెల్‌బోర్న్ భక్తులు కులకర్ణి కుటుంబ సభ్యుల క్షేత్రంలో దత్తదేవాలయ నిర్మాణ స్థలమును పరిశీలిస్తున్న స్వామీజీ, భక్త బృందం

5. మెల్‌బోర్న్‌లోని గ్రేట్ ఓషన్ రోడ్‌లో సముద్ర తీరాన శ్రీ స్వామీజీ

6. నీలై పట్టణం, మలేషియాలోని మరియమ్మ దేవాలయమున శ్రీ స్వామీజీ

7. సెయింట్ జూడ్ కమ్యూనిటీ సెంటరు, మెల్‌బోర్న్, ఆస్ట్రేలియానందు శ్రీచక్ర పూజను వీక్షిస్తున్న భక్తబృందం


6


4


7


5

BHAKTI MALA MONTHLY Regd News Paper - No 29690/76 April 2008
Registered with Dept. Of posts vide Regn. Nos.
KANNADA : KA/SK/MYS-97/2006-08: ENGLISH : KA/SK/MYS-95/2006-08 & TELUGU : KA/SK/MYS-96/2006-08
Licenced to post without Prepayment vide Licence Nos.
KANNADA : WPP-SK-3 : ENGLISH : WPP-SK-1 & TELUGU : WPP-SK-2




Printed and Published by Dr. A.N. Swarnaprasad for
Sri Bhakti Mala Trust, Mysore at Lakshmi Narasimha Mudrana
Sri Ganapati Sachchidananda Ashram, Mysore - 570 025 (India)